www.akshratimes.com

తెలుగు దినపత్రిక


# అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

PRGI.NO : APTEL /26/A4786


సంపుటి : 01 సంచిక : 26 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ సోమవారం 06 - 07 - 2026

Published by EAST GODAVARI : Circulated by: East Godavari, Polavaram, Kakinada




భారత శాస్త్రవేత్తల ఘనత.. ప్రయోగశాలలో కృత్రిమ 'మాయ' సృష్టి

## విశాఖ మత్స్యకారుల గల్లంతు గాలింపు చర్యలపై సీఎం చంద్రబాబు ఆరా




- విశాఖ నుంచి వేటకు వెళ్లిన 7గురు మత్స్యకారులు గల్లంతు
- గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- కోస్టుగార్డు, నేవీ నౌకలు, హెలికాప్టర్లతో గాలింపు
- సాంకేతిక లోపం వల్లే బోటు చిక్కుకుందని అధికారుల అనుమానం
- మత్స్యకారుల కుటుంబాలకు ధైర్యం చెప్పాలని మంత్రి, నేతలకు సీఎం సూచన


**విశాఖపట్నం :** విశాఖ నుంచి చేపల వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఉన్నతాధికారులను ఆదేశించారు. కుప్పం పర్యటనలో ఉన్న ఆయన, మత్స్యకారులు గల్లంతైన విషయం తెలియగానే ఫోన్ ద్వారా అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి ఈ నెల 1వ తేదీ సాయంత్రం 4 గంటలకు బోటులో ఏడుగురు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లారని అధికారులు సీఎంకు వివరించారు. 4వ తేదీ మధ్యాహ్నానికే వారు తిరిగి రావాల్సి ఉండగా, ఇప్పటికీ తీరానికి చేరలేదని తెలిపారు. గంగవరం సముద్ర తీరానికి సమీపంలో బోటులో సాంకేతిక లోపం తలెత్తినట్లు భావిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం కోస్టుగార్డు, నేవీ, మెరైన్ పోలీసు - మిగతా 2 లో

# రాష్ట్ర అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- మేం కష్టపడి ప్రాజెక్టులు తీసుకువస్తే, తామే తెచ్చినట్లు సిగ్గులేకుండా చెప్పుకుంటున్నారు
- కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన
- మీడియా ప్రతినిధులతో చిట్ చాట్
- రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలను తరిమికొట్టడమే వైసీపీ పని అంటూ విమర్శలు
- కూటమి తెచ్చిన ప్రాజెక్టులకు క్రెడిట్ కొట్టేస్తున్నారని ఆగ్రహం
- తమపై దుష్ప్రచారానికి సోషల్ మీడియాకు ఫండింగ్ చేస్తున్నారని ఆరోపణలు



**అమరావతి :** రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలను తరిమికొట్టడమే పనిగా పెట్టుకున్నారని, కూటమి ప్రభుత్వం ఎంతో కష్టపడి తెస్తున్న ప్రతి ప్రాజెక్టును తామే తెచ్చినట్లు సిగ్గులేకుండా చెప్పుకుంటున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు వైసీపీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో అభివృద్ధిని అడ్డుకోవడమే కాకుండా, ఇప్పుడు కూడా అబద్ధపు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం కుప్పం వచ్చిన ఆయన, మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తనపైనా, పవన్ కల్యాణ్ పైనా నిరంతరం దుష్ప్రచారం చేసేందుకు కొన్ని సోషల్ మీడియా గ్రూపులకు 'గొడ్డలి పార్టీ' నేతలు ప్రత్యేకంగా నిధులు సమకూరుస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. హింస, అసభ్యత, వర్గవిభేదాలు, రౌడీయిజం వంటి వాటినే ఆ పార్టీ నమ్ముకుందని, వారి అడ్డంకులు ఎన్ని ఎదురైనా రాష్ట్రంలో అభివృద్ధి మాత్రం - మిగతా 2 లో



## బంగాళాఖాతంలో వాయుగుండం ఉత్తరాంధ్రకు భారీ వర్ష సూచన

- వాయుగుండంగా మారిన అల్పపీడనం
- ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరంలో కేంద్రీకృతం
- 24 గంటల్లో బాలాసోర్ వద్ద తీరం దాటే అవకాశం
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక

**అమరావతి :** వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ఈ వాయుగుండం ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర - మిగతా 2 లో

### త్వరలో స్థానిక ఎన్నికలు వస్తున్నాయి

## అన్ని చోట్లా గెలవాల్సిందే

- కుప్పం నుంచి సీఎం చంద్రబాబు పిలుపు
- క్షేత్రస్థాయిలో పొలిటికల్ గవర్నెన్స్ అవసరమన్న చంద్రబాబు
- అధికారులు, పోలీసులతో సమన్వయంతో పనిచేయాలని కార్యకర్తలకు సూచన
- త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలవాలని పిలుపు
- పనితీరు ఆధారంగానే పార్టీలో పదవులు ఉంటాయని స్పష్టీకరణ

**అమరావతి :** తన సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు, మూడో రోజు పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా కార్యకర్తలు - మిగతా 2 లో

## ఖమేనీ శవపేటిక చూసి భోరున విలపించిన కుమారులు!

- ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో హతమైన ఇరాన్ అధినేత ఖమేనీ
- అంత్యక్రియల కోసం టెహ్రాన్ వీధుల్లోకి లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలు
- అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా మిన్నంటిన నినాదాలు
- కార్యక్రమాలకు దూరంగా కొత్త అధినేత మొజ్తబా ఖమేనీ
- యుద్ధం కారణంగా వాయిదా పడి ఇప్పుడు జరుగుతున్న కార్యక్రమాలు



**ఢిల్లీ :** అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడిలో హతమైన ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు టెహ్రాన్‌లో కొనసాగుతున్నాయి. ఆదివారం లక్షలాది - మిగతా 2 లో

### అయోధ్య రామమందిర విరాళాల కేసులో

## దోషులకు కఠిన శిక్ష పడాలి



- ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్
- అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగం కేసు
- బీజేపీ- ఆర్‌ఎస్‌ఎస్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు
- ప్రతిపక్ష నేతల్ని విచారించాలని డిమాండ్ చేస్తున్న వీహెచ్‌పీ

**ఢిల్లీ :** అయోధ్య రామ మందిర విరాళాల అవకతవకలపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) అధినేత ఆదివారం కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన తీవ్రంగా ఖండించదగినదని, దోషులను కఠినంగా శిక్షించాలని ఈ సంస్థ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే చేసిన ప్రకటననే ఆయన బలపరిచారు. ఇంతకు మించి అదనపు వ్యాఖ్యలు చేయడానికి ఆయన నిరాకరించారు. 'సన్మార్గ్ మైండ్ వెల్నెస్' ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా విలేకరులతో మాట్లాడిన - మిగతా 2 లో

## గత సమావేశాల్లోని నిర్ణయాలు అమలు కావడం లేదు

- కేంద్రమంత్రులకు రేవంత్ మరోసారి లేఖలు
- హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై కేంద్రమంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి లేఖలు
- గత నెలలో జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం లేదన్న సీఎం
- వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి

**హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి లేఖలు రాశారు. గత నెలలో జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం లేదన్నారు. మెట్రో రైలుపై అధ్యయన బాధ్యతలు ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించాలని సీఎం కోరారు. - మిగతా 2 లో





## కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్న పోలీసులు

- కన్నెపల్లి పంప్‌హౌస్ పర్యటనకు బయలుదేరిన కేటీఆర్
- జనగామ జిల్లా పెంబర్తి వద్ద కాన్వాయ్‌ను అడ్డుకున్న పోలీసులు
- భారీ కాన్వాయ్‌కు అనుమతి లేదంటూ పోలీసుల అభ్యంతరం
- చర్చల తర్వాత కేటీఆర్ పర్యటనకు అనుమతి

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌కు జనగామ జిల్లాలో పోలీసుల నుంచి అడ్డంకి ఎదురైంది. కన్నెపల్లి పంప్‌హౌస్ పర్యటనకు భారీ కాన్వాయ్‌తో బయలుదేరిన ఆయనను - మిగతా 2 లో

## కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను గాడిలో పెట్టాం



2 లో

- బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజల జీవితాలు తాకట్టుపడ్డాయి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- కన్నెపల్లి పంపు వద్ద కేటీఆర్ నాటకాలు చేస్తున్నారని మంత్రి ఎద్దేవా
- పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవితాలను బీఆర్ఎస్ తాకట్టు పెట్టిందన్న మంత్రి ఉత్తమ్
- తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఉత్తమ్ మండిపాటు
- రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టే కల్పించారు
- కాళేశ్వరం నిర్మాణ లోపాల వల్లే ప్రాజెక్టులు నిర్వీర్యమయ్యాయని వ్యాఖ్యలు

## తెలంగాణలో పెన్షన్ల స్కామ్‌కు చెక్ 3 లక్షల మంది అర్హులకు కొత్తగా ఆసరా!

- తెలంగాణలో భారీ పెన్షన్ల కుంభకోణం గుర్తింపు
- లక్ష మంది అనర్హులు, మృతుల పేర్లతో డబ్బు డ్రా చేస్తున్నట్లు వెల్లడి
- అనర్హులను తొలగించి, వారి స్థానంలో కొత్తవారికి అవకాశం
- రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 3 లక్షల మందికి పెన్షన్ల మంజూరుకు నిర్ణయం
- ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న అర్హులకు ప్రభుత్వ నిర్ణయంతో ఊరట



**హైదరాబాద్ :** తెలంగాణలో అర్హులైన నిరుపేదలకు అండగా ఉండాల్సిన సామాజిక భద్రతా పెన్షన్ల వ్యవస్థలో ఏళ్లుగా జరుగుతున్న భారీ దోపిడీకి రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. సంక్షేమ ఫలాలు దుర్వినియోగం కాకుండా చూడాలనే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో దిమ్మతిరిగే వాస్తవాలు వెలుగుచూశాయి. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా అనర్హులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పెన్షన్లు పొందుతున్నట్లు అధికారికంగా నిర్ధారించారు. మరింత దారుణమైన విషయం ఏమిటంటే.. కొన్నేళ్ల క్రితం మరణించిన లబ్ధిదారుల పేర్లను జాబితా నుంచి తొలగించకుండా, వారి స్థానంలో కొందరు అక్రమార్కులు అధికారుల కళ్లుగప్పి నెలనెలా డబ్బులు డ్రా చేస్తున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. ఈ భారీ అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను ఆయుధంగా ప్రయోగించింది. లబ్ధిదారులు జీవించి ఉన్నారో లేదో నిర్ధారించే 'లైఫ్ అథెంటికేషన్' ప్రక్రియను రాష్ట్రవ్యాప్తంగా తప్పనిసరి చేయడంతో దొంగ పెన్షన్ల దందా బట్టబయలైంది. ఈ - మిగతా 2 లో

# సంపాదకీయం

## 'అస్తిత్వ' అవస్థల్లో భారతీయులు!

భారతీయుడా, నీవు భారతీయ పౌరుడువేనా?! విడ్డూరమైన కాలమిది. కాకపోతే భారతీయ పౌరుడుగా గుర్తింపు విషయంలో భారతీయులు అయోమయంలో పడవలసిరావడమేమిటి? సగటు భారతీయుడు తన జాతీయత నిర్ధారణకు న్యాయబద్ధమైన ప్రమాణం ఏమిటో తెలుసుకోవడానికి ప్రయాసపడుతున్నాడు అతడికి దిశా నిర్దేశం చేయవలసిన అధికార వ్యవస్థ ఇప్పటి వరకు స్పష్టమైన విధి విధానాలు వెల్లడించలేదు. ఇది విచిత్ర సందర్భం కాదూ?ఒక దేశానికి సార్వభౌమాధికారం ఎంత ముఖ్యమో ఆ దేశవాసులకు జాతీయత, పౌరసత్వం ఉండడం కూడా అంతే ముఖ్యం. మన పొరుగు దేశాలు అయిన నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో అత్యంత వెనుకబడిన మారుమూల ప్రాంతాలలో సైతం పౌరసత్వం, జాతీయత విషయంలో స్పష్టమైన విధివిధానాలు అమలులో ఉన్నాయి. మరి భారత్‌లో ఆ ప్రాథమిక గుర్తింపుల విషయంలో ఒక కచ్చితమైన విధానం లేకపోవడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వానికి ప్రామాణిక ధ్రువీకరణ కాదని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఆ పెద్దమనిషి ప్రకటన కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అసంఖ్యాకులను ఆందోళనకు గురిచేస్తోంది.చట్టాలు, అధికారిక నిబంధనల ప్రకారం పాస్‌పోర్ట్, పౌరసత్వం వేర్వేరు అంశాలే అయినప్పటికీ పరస్పర అనుసంధానం ఉన్న విషయాలు. దుబాయిలోని ప్రవాస భారతీయ కుటుంబాల నవజాత శిశువులకు తల్లిదండ్రుల పాస్‌పోర్ట్‌ల ఆధారంగా వారి జాతీయతను నిర్ధారించి, పౌరసత్వాన్ని నమోదు చేస్తారు. ఆ తరువాత మాత్రమే భారత విదేశాంగ శాఖ ఆ పసి ప్రాయులకు పాస్‌పోర్ట్‌లు జారీ చేస్తుంది. ఉదాహరణకు బహ్రెయిన్‌లో, తెలంగాణలోని కామారెడ్డి జిల్లాకు చెందిన ప్రవాస దంపతులకు జన్మించిన ఒక బాలిక జననాన్ని నిర్దిష్ట కాలంలో నమోదు చేయకపోవడంతో అమె భారతీయ పౌరసత్వాన్ని భారత ప్రభుత్వం గుర్తించలేదు. తత్కారణంగా అమెకు పాస్‌పోర్ట్ జారీలో జాప్యం జరిగి, స్వదేశానికి తిరిగి వెళ్ళడంలో ఆ చిన్నారికి సమస్యలు సంభవించాయి. జాతీయతను నిర్ధారించుకున్న తరువాతనే పౌరసత్వాన్ని నమోదు చేసి, పాస్‌పోర్ట్ జారీ చేసే విధానమే ప్రపంచమంతటా అమలులో ఉన్నది. భారత్‌లో సైతం దరఖాస్తుదారుడు భారతీయుడు అని నిర్ధారించుకున్న తర్వాతే పాస్‌పోర్ట్‌ను జారీ చేస్తారు. ఈ నేపథ్యంలో పౌరసత్వానికి పాస్‌పోర్ట్ ప్రమాణం కాదని విదేశాంగ శాఖ అనడం సువిశాల భారతీయ సమాజాన్ని సందిగ్ధావస్థలో పడవేసింది. సమస్త ధ్రువీకరణలలో పాస్‌పోర్ట్‌ను అత్యున్నత విశ్వసనీయ అధికారిక పత్రంగా భావిస్తారు. ఇది, దేశ జనాభాలో కేవలం 6.5శాతం మంది వద్ద మాత్రమే ఉన్నది. అయినప్పటికీ పాస్‌పోర్ట్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడం సహజంగానే అసంఖ్యాకులను ఉలికిపాటుకు గురిచేసింది.జాతీయతను జాతీయ పౌరసత్వ నమోదు (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్-- ఎన్ఆర్‌సీ) ద్వారా నిర్ధారిస్తారు. ఇందుకు జాతీయ జననాల నమోదు అవసరం. దురదృష్టవశాత్తు రాజకీయ పార్టీల స్వార్థ ప్రయోజనాల కారణంగా ఈ ప్రక్రియ 2003 వరకు అస్తవ్యస్తంగా కొనసాగింది. కేంద్ర హోం శాఖ పరధిలోని ఈ అంశాన్ని దాని పక్షాన స్థానిక సంస్థలు నిర్వహిస్తాయి. స్థానిక స్వపరిపాలనా సంస్థలలోని ప్రజాప్రతినిధులు ఎప్పుడూ, ఎక్కడా కూడ ఈ విషయమై ప్రజలలో అవగాహన కల్పించలేదు. ప్రభుత్వాలూ సరిగా పట్టించుకోలేదు. జననాల నమోదులో చోటుచేసుకున్న అలసత్వానికి ప్రజల కంటే పాలకులే ప్రథమ దోషులు అని చెప్పక తప్పదు.అయితే రెండు దశాబ్దాల క్రితం ఈ శోచనీయ పరిస్థితి మారింది. నాటి నుంచి జననాల నమోదు క్రమబద్ధంగా జరుగుతోంది. ప్రస్తుత యువతరంలో అత్యధికుల జననం అధికారికంగా నమోదయి ఉంది. అయితే వారి తల్లిదండ్రుల జననాల విషయంలో మాత్రం స్పష్టత లేదు. 1987కు ముందు జన్మించిన వారికి జనన సర్టిఫికెట్లు అవసరం లేదని ప్రభుత్వం చెబుతున్నది. 2004 అనంతరం జన్మించిన వారి జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు తల్లిదండ్రుల సర్టిఫికెట్లను సైతం అడుగుతోంది. దీంతో పరిస్థితి సంక్లిష్టమవుతోంది.గ్రామీణ ప్రాంతాలలోని బడుగువర్గాలలో, ప్రత్యేకించి బాలికల అక్షరాస్యత ఇప్పటికీ అంతంతమాత్రమే. ఈ పరిస్థితుల్లో జననాల ధ్రువీకరణ పత్రాలు ఉండడం అంత సులభతరం కాదు. జననల నమోదు సక్రమంగా జరిగి ఉంటే జాతీయత, పౌరసత్వం ఉనికికి సంబంధించి అయోమయ పరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదు. 1945లో న్యూఢిల్లీలో జన్మించిన పాకిస్థాన్ సైనిక పాలకుడు జనరల్ జనరల్ పర్వేజ్ ముష్రాఫ్ జనన సర్టిఫికెట్ లభించినంత సులువుగా అసలు సిసలైన భారతీయుల జనన సర్టిఫికెట్లు లభించవనేది అందరికీ తెలిసిన విషయమే. అక్షరాస్యత లేని ఆఫ్రికా ఆటవీ ప్రాంతాలలోను, అరేబియా ఎడారి కుగ్రామాల ఇసుక దిబ్బలలో గుడారాలలో నివసించె వెనుకబడ్డ తెగల ప్రజల జననాలు, మరణాలు కచ్చితమైన వివరాలతో నమోదవుతున్నాయి. మరి ఈ విషయంలో భారత్ ఎందుకు విఫలమయింది? ఆత్మపరిశీలన చేసుకోవాలి.

## విశాఖ మత్స్యకారుల గల్లంతు గాలింపు చర్యలపై సీఎం చంద్రబాబు ఆరా

**మొదటిపేజీ తరువాయి -** విభాగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయని, ఈ ఉదయం నుంచి నౌకాదళ హెలికాప్టర్‌ను కూడా రంగంలోకి దించినట్లు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, గాలింపు చర్యలను సమన్వయం చేసుకోవాలని మెరైన్ ఐజీ, విశాఖ సీపీలకు సూచించారు. ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని ఆదేశించారు. అదే సమయంలో మత్స్యకారుల కుటుంబాలకు ధైర్యం చెప్పి అండగా నిలవాలని మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులను కోరారు.

## బంగాళాఖాతంలో వాయుగుండం ఉత్తరాంధ్రకు భారీ వర్ష సూచన


**మొదటిపేజీ తరువాయి -** విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ఆదివారం వెల్లడించింది. ప్రస్తుతం ఇది ఒడిశాలోని బాలాసోర్‌కు 50 కిలోమీటర్ల దూరంలో, చాంద్‌బలి, దిఘాలకు చెరో 60 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని అధికారులు తెలిపారు.ఈ వాయుగుండం పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ రానున్న 24 గంటల్లో చాంద్‌బలి-దిఘా మధ్య బాలాసోర్ సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలోని ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ పేర్కొంది. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని తెలిపింది.ఈ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాయుగుండం కదలికలను నిరంతరం గమనిస్తున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

## త్వరలో స్థానిక ఎన్నికలు వస్తున్నాయి అన్ని చోట్లా గెలవాల్సిందే

**మొదటిపేజీ తరువాయి -** వ్యవహరించాల్సిన తీరుపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. పై స్థాయిలోనే కాకుండా క్షేత్ర స్థాయిలో కూడా పొలిటికల్ గవర్నెన్స్ ఉండాలని, అప్పుడే నిజమైన సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు.శనివారం కుప్పంలో పర్యటనలో భాగంగా రైతులు, పీ4 లబ్ధిదారులు, అధికారులతో వరుస భేటీలు నిర్వహించిన అనంతరం, ఆయన నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశానికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు, జిల్లా అధ్యక్షుడు షణ్ముఖ రెడ్డితో పాటు ముఖ్య నేతలు హాజరయ్యారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారంలో పార్టీ యంత్రాంగం, ప్రభుత్వ అధికారులు, పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను అధికారులకు వివరించి, ప్రజా సమస్యలను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పేదల పక్షాన నిలిచే టీడీపీ నేతలు, కార్యకర్తలకు ప్రభుత్వ యంత్రాంగం అండగా నిలవాలని, వారిని గౌరవించాలని అన్నారు.గత ఐదేళ్ల పాలన (2019-24) రాష్ట్రానికి ఒక పీడకల వంటిదని, ఆ సమయంలో కుప్పం నియోజకవర్గంలో కూడా ప్రశాంతతను దెబ్బతీయాలని నాటి పాలకులు విఫలయత్నం చేశారని చంద్రబాబు విమర్శించారు. గొడ్డలి పార్టీ కుట్రల పట్ల కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, కుప్పంలో ఎవరైనా రౌడీయిజం చేయాలని చూస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, వాటన్నింటిలోనూ టీడీపీ నేతృత్వంలోని కూటమి అభ్యర్థులే గెలవాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు సహా స్థానిక సంస్థలన్నింటినీ కూటమే కైవసం చేసుకోబోతోందని ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం కార్యకర్తలకు సమాజంలో మంచి పేరు, గుర్తింపు ఉందని, దానికి భంగం కలిగేలా ఎవరూ ప్రవర్తించకూడదని హితవు పలికారు.పార్టీలో పదవుల కేటాయింపుపై కూడా చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై పనితీరు ఆధారంగానే పదవులు ఉంటాయని, నియామకాల్లో ఎలాంటి మొహమాటాలకు, సిఫారసులకు తావుండదని తేల్చిచెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించబోమని భరోసా ఇచ్చారు. బూత్ స్థాయి నుంచి ఏ పదవికైనా కార్యకర్తల ఆమోదం తప్పనిసరి అని స్పష్టం చేశారు. 2029 ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వచ్చి, గతంలో కంటే మెరుగైన మెజారిటీ సాధించేలా ఇప్పటి నుంచే కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యకర్తల ఆర్థిక సాధికారతకు పార్టీ కృషి చేస్తుందని, "ఇంటికో పారిశ్రామికవేత్త" విధానాన్ని పార్టీ కార్యకర్తలు కూడా అందిపుచ్చుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అందరి ఆమోదంతో త్వరలోనే కుప్పంలో ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు.

# రాష్ట్ర అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు

**మొదటిపేజీ తరువాయి -** ఆగదని స్పష్టం చేశారు.కుప్పం నియోజకవర్గానికి మునుపెన్నడూ చూడని రీతిలో ప్రాజెక్టులు వస్తున్నాయని, రోడ్లు, కమ్యూనికేషన్ సహా అన్ని రంగాల్లో కనెక్టివిటీ పెంచుతున్నామని తెలిపారు. త్వరలోనే అభివృద్ధి చెందిన సరికొత్త కుప్పాన్ని ప్రజలు చూస్తారని భరోసా ఇచ్చారు. వికేంద్రీకృత అభివృద్ధి విధానంలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని సమానంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రానికి క్వాంటం, సెమీ కండక్టర్ రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం వివరించారు. ఇందులో భాగంగా ఈ ఏడాది డిసెంబర్ నాటికి అమరావతిలో 'క్వాంటం కంప్యూటింగ్ సెంటర్' కార్యకలాపాలు



ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. ఇంధన రంగంలో సౌర, పవన విద్యుత్‌తో పాటు ఇతర అత్యాధునిక విధానాలను అమలు చేస్తున్నామన్నారు. దేశంలోని ప్రముఖ ఉక్కు పరిశ్రమలైన ఆర్సెలర్ మిట్టల్, జేఎస్‌డబ్ల్యూ వంటి సంస్థలు ఏపీలో తమ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నాయని గుర్తుచేశారు. పరిశ్రమలతో పాటు పర్యావరణ పరిరక్షణ, పచ్చదనానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు.గత పాలకులు విలువైన భూములు, ఖనిజ సంపదను ఒకే వ్యక్తి ప్రయోజనం కోసం కట్టబెట్టారని, ఏజెన్సీ ప్రాంతాలను గంజాయి సాగుకు కేంద్రంగా మార్చారని చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా తిరుమల ప్రసాదాన్ని సైతం కల్తీ చేశారని, అలాంటి వారు ఇప్పుడు నీతులు చెప్పడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

## తెలంగాణలో పెన్షన్ల స్కామ్‌కు చెక్ 3 లక్షల మంది అర్హులకు కొత్తగా ఆసరా!

**మొదటిపేజీ తరువాయి -** డిజిటల్ వెరిఫికేషన్ ద్వారా మరణించిన వారి వివరాలు, ఇతర అనర్హుల సమాచారం స్పష్టంగా వెల్లడైంది. దీంతో తక్షణమే స్పందించిన ఉన్నతాధికారులు, గుర్తించిన లక్ష మంది అనర్హుల పేర్లను లబ్ధిదారుల జాబితా నుంచి శాశ్వతంగా తొలగించాలని తుది నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రక్షాళనతో ప్రభుత్వ ఖజానాకు ప్రతి నెలా వృథాగా పోతున్న కోట్ల రూపాయల ప్రజాధనం ఆదా కానుంది.అయితే, అనర్హుల తొలగింపు ద్వారా మిగిలే నిధులను నిజమైన లబ్ధిదారులకే అందించాలని ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2 లక్షల మంది అర్హులకు పెన్షన్లు మంజూరు చేసేందుకు ప్రక్రియ కొనసాగుతుండగా, దానికి అదనంగా తాజాగా గుర్తించిన లక్ష మంది అనర్హుల స్థానంలో మరో లక్ష మంది కొత్త లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. దీంతో రాష్ట్రంలో మొత్తం 3 లక్షల మంది నిరుపేదలకు కొత్తగా ఆర్థిక భద్రత లభించనుంది. ఇందుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు, నిధుల సర్దుబాటుపై రాష్ట్ర ఆర్థిక శాఖ ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం.ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, చేనేత, గీత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, దివ్యాంగుల్లో సరికొత్త ఆశలు చిగురించాయి. ప్రస్తుతం గ్రామ, వార్డు స్థాయిల్లో అర్హులను గుర్తించే సర్వే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. అర్హుల వడపోత ప్రక్రియ తుది దశకు చేరుకుందని, త్వరలోనే లబ్ధిదారుల తుది జాబితాను అధికారికంగా విడుదల చేసి, కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు సచివాలయ ఉన్నత వర్గాలు వెల్లడించాయి.

## కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్న పోలీసులు



**మొదటిపేజీ తరువాయి -** పెంబర్తి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆదివారం మధ్యాహ్నం కేటీఆర్ తన పర్యటనలో భాగంగా భారీ సంఖ్యలో వాహనాలతో కూడిన కాన్వాయ్‌తో కన్నెపల్లికి బయలుదేరారు. అయితే, ఇంత పెద్ద కాన్వాయ్‌కు అనుమతి లేదని పోలీసులు పెంబర్తి వద్ద వాహనాలను నిలిపివేశారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.ఈ క్రమంలో కేటీఆర్ జోక్యం చేసుకుని, తన కాన్వాయ్‌లోని అన్ని వాహనాలను అనుమతించాల్సిందేనని పట్టుబట్టారు. కాన్వాయ్‌ను నిలిపివేయడంపై ఆయన పోలీసు అధికారులతో మాట్లాడారు. కొద్దిసేపటి చర్చల తర్వాత పోలీసులు వెనక్కి తగ్గడంతో, కేటీఆర్ కాన్వాయ్ యథావిధిగా కన్నెపల్లి పంప్‌హౌస్ వైపు తన పర్యటనను కొనసాగించింది.

# కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను గాడిలో పెట్టాం

**మొదటిపేజీ తరువాయి -** పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవితాలను బీఆర్ఎస్ తాకట్టు పెట్టిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో నీటి పారుదల శాఖను నాశనం చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు ఏది ముట్టుకుంటే అది నాశనమని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వ్యాఖ్యానించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. అధిక శాతం లోన్లు తీసుకొచ్చి బీఆర్ఎస్ నాయకుల లాభం కోసం కాళేశ్వరం కట్టారు తప్ప.. తెలంగాణ ప్రజల కోసం కాదని చెప్పుకొచ్చారు. రూ.1.81లక్షల కోట్లు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టు ఇచ్చారని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఆ ప్రాజెక్టులు అన్ని అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. తాము అధికారంలో వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వివరించారు. ఉల్టా చోర్ కొత్వాల్‌కు దండే అన్నట్లుగా బీఆర్ఎస్ నేతల తీరు ఉందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది కేసీఆర్ హయాంలోనే.. కూలిపోయింది వాళ్ల హయాంలోనే అని ఇంజినీర్లు రిపోర్ట్ ఇచ్చారని ప్రస్తావించారు. కన్నెపల్లి పంపు దగ్గరకు పోయి ప్రాణహిత పంపు ఆన్ చేసి నీళ్లు ఇవ్వాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ నాటకాలు ఆడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సరిగ్గా కడితే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ వల్లే కాళేశ్వరం నీళ్లు ఉపయోగించలేకపోతున్నామని అన్నారు. నాసిరక నిర్మాణం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు ఉపయోగించలేకపోతున్నామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫౌండేషన్ తప్పుగా ఉందని అధికారులు రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. కాళేశ్వరం ఇలానే కొనసాగిస్తే ప్రమాదమని అంతర్జాతీయ, జాతీయ నీటి నిపుణులు నివేదిక ఇచ్చారని అన్నారు. కేటీఆర్ కన్నా ఎన్డీఎస్ఏ అధికారులకు నాలెడ్జ్ ఎక్కువగా ఉందని తాను అనుకుంటున్నానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు స్టోరేజ్ చేసినప్పుడు కూలిపోతే కింద ఉన్న 40 ఊర్లు, భద్రాచలం కొట్టుకుపోతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు కమీషన్లకు కక్కుర్తి పడి తుమ్మిడిహెట్టి వద్ద



ప్రాజెక్ట్ కట్టకుండా తెలంగాణ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. లేకపోతే ఎప్పుడో ఉత్తర తెలంగాణ సస్యశామలం అయ్యేదని వివరించారు. తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసింది గులాబీ పార్టీనే అని ఆగ్రహించారు. కాంగ్రెస్‌కి మంచి పేరు వస్తుందనే కారణంతో తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకి డిజైన్ మార్చారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దుయ్యబట్టారు.

# అయోధ్య రామమందిర విరాళాల కేసులో దోషులకు కఠిన శిక్ష పడాలి

**మొదటిపేజీ తరువాయి -** ఆయన, ఒక రోజు క్రితం ఆర్ఎస్ఎస్ విడుదల చేసిన అధికారిక ప్రకటనను చూడాలని కోరారు.శుక్రవారం హోసబలే మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "తరాల పోరాటాలు, కోట్ల మంది రామభక్తుల అంకిత భావం, త్యాగం, బలిదానాల వల్ల శ్రీరామ జన్మభూమిపై నిర్మించిన ఈ అద్భుత ఆలయం యావత్ హిందూ సమాజానికి భక్తి, శ్రద్ధ, విశ్వాసాలకు కేంద్రంగా మారింది. అయితే ఈ ఆయోధ్య రామమందిరంలో ఉంచిన విరాళాల దొంగతనం ఒక దురదృష్టకర ఘటన. ఇది మొత్తం సమాజం, రామభక్తుల మనోభావాలను, భక్తిని గాయపరిచింది. మనందరినీ ఎంతగానో గాయపరిచింది. ఇది తీవ్రంగా ఖండించదగినది. కనుక దర్యాప్తులో దోషులుగా తేలిన ఎవరికైనా కఠినమైన శిక్ష పడేలా చూడడం అత్యవసరం" అని అన్నారు.మరోవైపు అయోధ్య రామ మందిరం విరాళాల దుర్వినియోగం ఆరోపణల కేసు రాజకీయంగా మరింత వేడెక్కుతోంది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ తాజాగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. మరోవైపు విశ్వ హిందూ పరిషత్ (ఎవూ) ప్రతిపక్ష నేతలు చేసిన ఆరోపణలపైనా దర్యాప్తు జరపాలని డిమాండ్ చేసింది. దీంతో ఈ కేసు రాజకీయంగా కొత్త మలుపు తిరిగింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆదివారం రోజు మీడియాతో మాట్లాడుతూ బీజేపీపై విరుచుకుపడ్డారు. బీజేపీ రాజకీయ వ్యూహం ఇప్పుడు 'ఓటు చోరీ, సీటు చోరీ, చందా చోరీ' గా మారిందని విమర్శించారు. అయోధ్య రామ మందిరం కోసం భక్తులు సమర్పించిన వేల కోట్ల రూపాయల విరాళాల్లో భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటివరకు స్పందించకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు.రామ మందిరం నిర్మాణానికి రాజకీయంగా క్రెడిట్ తీసుకున్న నాయకులు ఇప్పుడు ఈ ఆరోపణలపై ఎందుకు మౌనం వహిస్తున్నారని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ' రామ మందిరం నిర్మాణం, అలాగే 2024 జనవరి 22న రామ మందిరం ప్రారంభోత్సవ ఘనతను తమ ఖాతాలో వేసుకున్న ప్రధాన మంత్రి- ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్యను కోల్పోయినప్పటికీ- దీనిపై ఏదైనా ప్రకటన చేస్తారని మేం ఆశిస్తున్నాం. కానీ వారు పూర్తిగా మౌనంగానే ఉన్నారు.' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఈ కేసును సిట్టింగ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, నిందితులపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ 'చందా దో.. ధందా లో' అనే విధానమే బీజేపీ రాజకీయ సంస్కృతిలో భాగమని ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని సుప్రీం కోర్టు రద్దు చేసిందని, విరాళాల రాజకీయాలు బీజేపీ డీఎన్ఏలో భాగమని ఆయన ఆరోపించారు.ఇక ఇదే సమయంలో విశ్వ హిందూ పరిషత్ (ఎవూ) అంతర్జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ మరో కీలక డిమాండ్ చేశారు. రామ మందిరం విరాళాల దుర్వినియోగం కేసుపై బహిరంగంగా ఆరోపణలు చేసిన ప్రతిపక్ష నేతల్ని కూడా దర్యాప్తు అధికారులు విచారించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, సమాజ్ వాదీ పార్టీ నేత రామ్ గోపాల్ యాదవ్ చేసిన వ్యాఖ్యల నిజానిజాల్ని పరిశీలించాలని సూచించారు. ఈ నేతలు తమ ఆరోపణలకు తగిన ఆధారాలు సమర్పిస్తే వాటిని దర్యాప్తులో భాగంగా పరిగణించాలని, ఆధారాలు లేకుండా ప్రజల్ని తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు చేసి ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవాలని అలోక్ కుమార్ తన లేఖలో పేర్కొన్నారు.ఈ కేసులో యూపీ సర్కార్ ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను కొనసాగిస్తోంది. సిట్ ప్రాథమిక నివేదిక ఆధారంగా జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, ఇప్పటివరకు 8 మందిని అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఆరుగురి వద్ద నుంచి సుమారు రూ. 80 లక్షల వరకు నగదు, కొంత విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. మరోవైపు తీర్థ క్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రా ఇప్పటికే తమ పదవులకు రాజీనామాలు చేశారు. కేసుపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యుడు మహంత్ దినేంద్ర దాస్ మహారాజ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి దోషులెవరైనా కఠినంగా శిక్షించాలని అన్నారు. రామ మందిరం విరాళాల దుర్వినియోగం అత్యంత తీవ్రమైన నేరమని పేర్కొన్న ఆయన, ఆలయంలో పూజా కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతున్నాయన్నారు. విరాళాల నిర్వహణలో పారదర్శకతను మరింత బలోపేతం చేశామని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, రాజకీయ ఆరోపణలు-ప్రత్యారోపణలు మరింత వేడెక్కుతున్నాయి.

## ఖమేనీ శవపేటిక చూసి భోరున విలపించిన కుమారులు!

**మొదటిపేజీ తరువాయి -** మంది ప్రజలు టెహ్రాన్ వీధుల్లోకి, గ్రాండ్ మొసల్లా కాంప్లెక్స్‌లోకి తరలివచ్చి తమ ప్రియతమ నేతకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా "డెత్ టు అమెరికా", "డెత్ టు ఇజ్రాయెల్" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని ప్రదర్శించారు. జులై 4న ప్రారంభమైన ఈ అంత్యక్రియల కార్యక్రమాలు ఆరు రోజుల పాటు కొనసాగి, జులై 9న మషద్‌లో ఖననంతో ముగుస్తాయి. టెహ్రాన్‌లో జరిగిన ప్రార్థనల్లో ఖమేనీ ముగ్గురు కుమారులు మోస్తఫా, మీసమ్, మసౌద్‌తో



పాటు ఉన్నతాధికారులు, సైనిక ప్రముఖులు పాల్గొన్నారు. తండ్రి శవపేటికను చూసి కుమారులు కన్నీటిపర్యంతమయ్యారు. 36 ఏళ్లు ఇరాన్‌ను పాలించిన ఖమేనీ, ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఇరాన్ యుద్ధంలో జరిగిన తొలి దాడుల్లో తన కుటుంబ సభ్యులతో సహా హతమయ్యారు. యుద్ధం కారణంగా మార్చిలో జరగాల్సిన ఈ కార్యక్రమాలు వాయిదా పడ్డాయి. ప్రస్తుతం అమలవుతున్న కాల్పుల విరమణ నేపథ్యంలో వీటిని తిరిగి ప్రారంభించారు.అయితే, ఖమేనీ రెండో కుమారుడు, ఆయన తర్వాత ఇరాన్ మూడో సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ ఈ కార్యక్రమాలకు హాజరుకాలేదు. ఫిబ్రవరిలో జరిగిన దాడుల్లో ఆయన గాయపడినట్లు, భద్రతా కారణాల దృష్ట్యా ఆయన బయటకు రావడం లేదని తెలుస్తోంది. ఇజ్రాయెల్ మళ్లీ దాడి చేయవచ్చనే ఆందోళనల నడుమ ఆయన కేవలం ప్రకటనలకే పరిమితమయ్యారు.ఈ అంత్యక్రియలు ఇస్లామిక్ రిపబ్లిక్ పాలన కొనసాగింపును, ఐక్యతను చాటే రాజకీయ ప్రదర్శన అని విశ్లేషకులు భావిస్తున్నారు. పటిష్ఠ భద్రత నడుమ జరుగుతున్న ఈ కార్యక్రమాలకు పలు దేశాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. రానున్న రోజుల్లో మరిన్ని ఊరేగింపుల తర్వాత మషద్‌లోని ఇమామ్ రెజా పుణ్యక్షేత్రంలో ఖమేనీ భౌతిక కాయాన్ని ఖననం చేయనున్నారు.

## గత సమావేశాల్లోని నిర్ణయాలు అమలు కావడం లేదు

**మొదటిపేజీ తరువాయి -** షరతులు, విధివిధానాలు వెంటనే ఖరారు చేయాలన్నారు. మెట్రో మొదటి దశ టేకోవర్, రెండో దశ అనుమతులు జాప్యం అవుతున్నాయని, వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రులను సీఎం రేవంత్‌రెడ్డి లేఖల్లో కోరారు.ఇటీవలే కేంద్రమంత్రులతో భేటీ అయిన సీఎం : మెట్రో



రైలు పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి ఇది వరకే పలుమార్లు లేఖలు రాశారు. తెలంగాణలో మెట్రో రైలు విస్తరణకు సహకరించాలని రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కొద్దిరోజుల క్రితమే దిల్లీలోని రైల్ భవన్‌లో కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై విస్తృతంగా చర్చించారు.తెలంగాణ రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మెట్రో రైలు విస్తరణను చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దీనికి కేంద్రం సహాయం అవసరమని సీఎం వివరించినట్టు సమాచారం. మెట్రో విస్తరణకు నోచుకోకపోవడంతో హైదరాబాద్‌లో నగరంలో ఎదురవుతున్న ఇబ్బందులను కేంద్రమంత్రి దృష్టికి రేవంత్ తీసుకెళ్లారు. విస్తరణకు సంబంధించిన అన్ని ప్రక్రియలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పిన సీఎం, దీనికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి రావాల్సిన రుణాన్ని త్వరగా విడుదలయ్యేలా చొరవ చూపాలని కోరారు.భేటీ సందర్భంగా ఈ ప్రాజెక్టు చుట్టూ ఏర్పడిన రాజకీయ అంశాలు సైతం చర్చకు వచ్చినట్లు తెలిసింది. దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో మెట్రో రెండో దశ అనుమతులపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించిన పలు అంశాలపై కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. అయితే మెట్రో అంశం రైల్వే శాఖ పరిధిలోనిది కానందున కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో తాను మాట్లాడతానని హామీ ఇవ్వడంతో పాటు వెంటనే ఆ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం.

అక్షర టైమ్స్

www.akshratimes.com

తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం

గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

ప్రమాదాల నివారణకు గోకవరం పోలీసుల ప్రత్యేక చర్యలు

గోకవరం ఎస్ఐ పవన్ కుమార్

# "ఆగి... నెమ్మదిగా వెళ్లండి"




**గోకవరం,జులై 05 .అక్షర టైమ్స్ :** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలంలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రమాదాలు ఎక్కువగా సంభవించే ప్రధాన రహదారులు, జంక్షన్లు, ప్రమాదకర ప్రాంతాల్లో రేడియం స్టిక్కర్లతో కూడిన హెచ్చరిక డ్రమ్స్ ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో కూడా వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా ఈ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి అప్రమత్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గోకవరం ఎస్ఐ వి.ఎస్.వి . పవన్ కుమార్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతానికి ముఖద్వారమైన గోకవరం మీదుగా ప్రతిరోజూ భారీ సంఖ్యలో వాహనాలు, పర్యాటకులు రాకపోకలు సాగిస్తారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఘాట్ రోడ్లు, వరుస మలుపులు ప్రమాదాలకు ఆస్కారం కల్పిస్తున్నందున వాహనదారులు అత్యంత అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని పిలుపునిచ్చారు. గోకవరం హాట్స్పాట్ జంక్షన్ మండలంలో వీరంకపల్లి బావాజీపేట, గుమ్మలదొడ్డి గ్రామ కూడళ్లు తదితర ప్రమాదకర ప్రాంతాల్లో ఈ రేడియం హెచ్చరిక డ్రమ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రమాద ప్రాంతాలను గుర్తించి ఇలాంటి భద్రతా చర్యలను విస్తరించనున్నట్లు వెల్లడించారు. "ఆగి... నెమ్మదిగా వెళ్లండి – మీ కుటుంబం మీ కోసం ఎదురుచూస్తోంది" అనే సందేశంతో ఏర్పాటు చేసిన ఈ హెచ్చరిక బోర్డులు వాహనదారుల్లో రోడ్డు భద్రతపై మరింత అవగాహన పెంచి ప్రమాదాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పోలీసులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## రేపు కొండాపూర్ డివిజన్‌లో
# ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ శంకుస్థాపనలు

పాల్గొననున్న మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్

కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పిలుపు




**శేర్లింగంపల్లి,జులై 05 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి ఎం.ఈరన్న కొండాపూర్ డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపనలు జరగనున్నాయి. డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ చేపట్టనున్న ఈ కార్యక్రమాల్లో శేర్లింగంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు, పిఏసీ చైర్మన్ అరేకపూడి గాంధీ , కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ ముఖ్య అతిథులుగా పాల్గొని, చేతులమీదుగా శంకుస్థాపనలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కార్యాలయ ప్రతినిధులు శంకుస్థాపనల షెడ్యూల్ వివరాలను విడుదల చేశారు.

**శంకుస్థాపన కార్యక్రమాల వివరాలు:**

ఉదయం 11:00 గంటలకు: ప్రేమ్ నగర్ బీ బ్లాకులోని హిందూ స్మశాన వాటిక వద్ద అభివృద్ధి పనుల ప్రారంభం. ఉదయం 11:15 గంటలకు: ఓయూ కాలనీలోని 60 ఫీట్ల రోడ్డు వద్ద శంకుస్థాపన. ఉదయం 11:25 గంటలకు: ఓయూ కాలనీలోని వీధి నెంబర్ 3 దగ్గర పనుల ప్రారంభం. ఉదయం 11:35 గంటలకు: ఓయూ కాలనీలోని వీధి నెంబర్ 5 దగ్గర శంకుస్థాపన. ఉదయం 11:45 గంటలకు: శ్రీరామ్ నగర్ ఏ బ్లాకులోని శ్రీ రామ హై స్కూల్ దగ్గర అభివృద్ధి పనులకు భూమిపూజ విజయవంతం చేయాలని పిలుపు.కొండాపూర్ డివిజన్ అభివృద్ధిని కాంక్షిస్తూ నిర్వహిస్తున్న ఈ శంకుస్థాపనల కార్యక్రమాల్లో డివిజన్ పరిధిలోని సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువ నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ కార్యాలయం ఓ ప్రకటనలో కోరింది.

## బాక్సైట్ తవ్వకాలకు ఇచ్చిన
# పర్మిషన్లు రద్దు చేయాలి కర్నాకుల డిమాండ్



**గోకవరం,జులై 05 .అక్షర టైమ్స్ :** గిరిజన ప్రాంతాల్లో బాక్సైట్ తవ్వకాలకు ఇచ్చిన పర్మిషన్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నాడు తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం రంప యర్రంపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ గిరిజనులను, అటవీ సంపదను దోచుకునే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉందని, సంపద సృష్టిలో భాగంగా బడా కార్పొరేట్ కంపెనీలకు అడవులను అప్పజెప్పే పనిలో కూటమి ప్రభుత్వం ఉందని కర్నాకుల విమర్శించారు. ఆదివాసిల భూములు,జీవనాధికారాల ను కాపాడాలని, గ్రామసభలు నిర్వహించాలని, గ్రామ సభ తీర్మానం లేకుండా తవ్వకాలు జరపరాదని, గిరిజన ప్రాంత బిడ్డలకు విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి యస్ యు (విజృంభణ)రాష్ట్ర కార్యదర్శి కే. సతీష్,గ్రామస్తులు గోలి మునలయ్య, నక్క వీర రాఘవ, రవణ, చింతపల్లి మునలయ్య తదితరులు పాల్గొన్నారు

## రోడ్డుపై వాహనాలు నిలిపితే చర్యలు తప్పవు ఎస్సై నాగమణి హెచ్చరిక



**గోకవరం,జులై 05 .అక్షర టైమ్స్ :** తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండల కేంద్రంలో రహదారులపై ఇష్టానుసారంగా వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గోకవరం ఎస్సై నాగమణి హెచ్చరించారు. ఆదివారం గోకవరం ప్రధాన రహదారులపై నిలిపిన వాహనాలను పరిశీలించిన ఎస్సై నాగమణి, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రహదారులపై వాహనాలను పార్క్ చేయకుండా నిర్ణీత పార్కింగ్ స్థలాల్లోనే నిలపాలని సూచించారు. అలాగే ర్యాష్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు అందరికీ సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజల సహకారంతో గోకవరం లో ట్రాఫిక్ సమస్యలను నియంత్రించి, రహదారులపై క్రమశిక్షణ నెలకొల్పేందుకు పోలీసులు నిరంతరం చర్యలు చేపడతారని ఎస్సై నాగమణి పేర్కొన్నారు.

## కామరాజపేటలోసీతారామచంద్రుల విగ్రహ
## ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం,జులై 05 .అక్షర టైమ్స్ :** గోకవరంమండలం కామరాజుపేట గ్రామం గోళ్ళ వీధిలో రామాలయం నూతన ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి జగ్గంపేట శాసనసభ్యులు, టిటిడి బోర్డు సభ్యులు, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మూడువేల మంది భక్తులకు మహా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

**విగ్రహాల దాత:**

జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్.ఈ కార్యక్రమంలోసర్పంచ్ అడపా వెంకట్రావు, సొసైటీ చైర్మన్ పీర్ల వెంకటేశ్వర రావు, మాజీ సర్పంచ్ అడపా బంగారు బాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు కటారి అంజనీ కుమార్ఆలయ కమిటీ సభ్యులు తెలుగుదేశం పార్టీ నాయకులు నడిమింటి రమణ, బత్తి శ్రీను, మాసిబోయిన రంగా, శ్రీగాకొల్లు శేషు బాబు, మాసిబోయిన కృష్ణ, మైలవరపు రఘు, యర్ర శ్రీను, పాశం శ్రీను, బి కన్నాబాబు, కాలిన వాసు, యాదల అప్పన్న, గోళ్ళ పండు, గోళ్ళ వెంకటేశ్వర రావు, విరమళ్ళ బాలు, మచర్ల బాబీ తదితరులు పాల్గొన్నారు.

## నెల గడిచినా విద్యార్థులకు
# అందని యూనిఫాం, బ్యాగులు,షూస్

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అసంతృప్తి: సుంకర వీరబాబు



**గోకవరం,జులై 05 .అక్షర టైమ్స్ :** ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై దాదాపు నెల రోజులు గడుస్తున్నప్పటికీ, విద్యార్థులకు ప్రభుత్వం అందించాల్సిన యూనిఫాంలు, స్కూల్ బ్యాగులు, షూస్ ఇంకా పూర్తిస్థాయిలో అందకపోవడం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందజేస్తామని ప్రకటించినప్పటికీ, అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ పంపిణీ పూర్తికాలేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. దీంతో విద్యార్థులు పాత యూనిఫాంలు, పాడైన బ్యాగులు, షూస్‌తోనే పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.ఈ విషయంపై రాష్ట్ర వైస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీ రాజ్ విభాగం జాయింట్ సెక్రటరీ సుంకర వీరబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అందించాల్సిన ప్రాథమిక సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా యూనిఫాంలు, బ్యాగులు, షూస్ అందకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న యూనిఫాంలు, బ్యాగులు, షూస్ పంపిణీ పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల చదువుకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలను తక్షణమే కల్పించాలని ఆయన కోరారు.


## రామాలయం మైక్ సెట్‌కు
# కంబాల శ్రీనివాసరావు రూ.27,500 విరాళం






**గోకవరం,జులై 05 .అక్షర టైమ్స్ :** పోలవరం జిల్లా, అడ్డతీగల మండలం నూకరాయి గ్రామంలోని శ్రీ రామాలయానికి మైక్ సెట్ కొనుగోలు చేయడానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు రూ. 27,500 విరాళాన్ని ఆదివారం గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద ఆ గ్రామ గిరిజనులకు అందజేశారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజన భక్తులు తమ గ్రామంలోని రామాలయానికి మైక్ సెట్ ఏర్పాటు చేయాలని కంబాల శ్రీనివాసరావు వద్దకు వచ్చి కోరారు. స్పందించిన ఆయన మైక్ సెట్ కొనుగోలుకు విరాళం అందించారు. ఆయన అందించిన విరాళంతో గ్రామ గిరిజనులు నూతన మైక్ సెట్‌ను కొనుగోలు చేశారు. అనంతరం ఆ మైక్ సెట్‌ను కంబాల శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, ఆయనను పూలమాలలతో ఘనంగా సత్కరించి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కంబాల శ్రీనివాసరావు అందిస్తున్న సహకారం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, గ్రామ గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న మెట్టు కుమార్ యాదవ్



**పటాన్‌చెరు,జులై 05 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో పలువురి నూతన గృహప్రవేశ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పటాన్‌చెరు అంబేద్కర్ కాలనీలో రజని దంపతులు నిర్మించుకున్న నూతన గృహంలో జరిగిన ప్రవేశ వేడుకలో మెట్టు కుమార్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో విలేకరి పవన్ నూతన గృహప్రవేశ కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కొత్త గృహాల్లోకి అడుగుపెట్టిన రజని దంపతులకు, పవన్ దంపతులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బొల్లారం ఆలయ ప్రతిష్ఠాపనలో
# పాల్గొన్న వెన్నవరం ఆదర్శ్ రెడ్డి

ప్రజల సుఖశాంతుల కోసం ప్రత్యేక పూజలు





**పటాన్‌చెరుజులై 05 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ బొల్లారం డివిజన్‌లో శ్రీ పోచమ్మ మరియు నల్ల పోచమ్మ అమ్మవార్ల విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమంలో పటాన్‌చెరు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు.?అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆదర్శ్ రెడ్డి, ప్రజలందరిపై దేవతల ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. నియోజకవర్గం సుఖశాంతులు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు, ధ్వజస్తంభం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచాయి. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డిలతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు మరియు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.ు

## అమీన్‌పూర్‌లో 'చైతన్య చిల్డ్రన్స్ క్లినిక్'
# ప్రారంభించిన మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి





**అమీన్‌పూర్,జులై 05 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు, కేజీఆర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 'చైతన్య చిల్డ్రన్స్ క్లినిక్'ను అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బి. చైతన్య ఆధ్వర్యంలో ఈ క్లినిక్ అందుబాటులోకి వచ్చింది.?ఈ సందర్భంగా మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. స్థానిక ప్రజల కోసం, ముఖ్యంగా చిన్న పిల్లల ఆరోగ్యం కోసం అందుబాటు ధరల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డాక్టర్ చైతన్య క్లినిక్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆయన డాక్టర్ చైతన్యను ప్రత్యేకంగా అభినందించారు. ౦ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కౌన్సిలర్ కొల్లూరి చంద్రకళ గోపాల్, ఉపేందర్ రెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, క్లినిక్ వైద్యులు డాక్టర్ బి. చైతన్య, పలువురు కాలనీ వాసులు, స్థానికులు పాల్గొన్నారు.

## కనుమర్ల మరియు అట్లా వారి వివాహ వేడుకలో
# పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుమల



**బేస్తవారి పేట,జులై 05 .అక్షర టైమ్స్ :** బేస్తవారిపేట పట్టణంలోని లక్ష్మి పద్మావతి వెంకటేశ్వర కళ్యాణ మండపం నందు అట్లా పాండు రంగారెడ్డి వెంకట లక్ష్మీదేవి కుమారుని కనుమర్ల రంగారెడ్డి విజయ లక్ష్మి కుమార్తె వివాహ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని వధూవరులు అయిన రామ్నాథ్ రెడ్డి మరియు భువన చతుర్వ లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ వివాహ కార్యక్రమంలో బేస్తవారిపేట టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## మొర్రి వారి వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి



**కంభం,జులై 05 .అక్షర టైమ్స్ :** కంబం మండలం కందులాపురం గ్రామానికి చెందిన మొర్రి పెద్ద ఆవులయ్య వెంకటలక్ష్మి కుమారుని వివాహ వేడుకలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని వధూవరులు అయిన చి " వెంకట శ్రీకాంత్ మరియు వాగ్దేవి లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ కార్యక్రమంలో కంబం మండల ప్రముఖులు, టిడిపి నాయకులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు


# విధుల పట్ల నిర్లక్ష్యం వహించే బిఎల్ఓ లపై వేటు

కలెక్టర్ విజయ సునీత



**గిద్దలూరు,జులై 05 .అక్షర టైమ్స్ :** సర్ ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్, డిజిటలైజేషన్ విధుల్లో నిర్లక్ష్యం వహించే బూతు లెవల్ అధికారులను సస్పెండ్ చేస్తామని మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత హెచ్చరించారు..ఆదివారం గిద్దలూరు పురపాలక సంఘ పరిధిలోని వివిధ కేంద్రాలను ఆకస్మికంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు.. కొన్ని చోట్ల పనులు నెమ్మదిగా సాగుతుశీడటం పై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు.ఎన్నికల కమిషన్ ఇచ్చిన గడువు తక్కువగా ఉన్నందువలన అధికారులు త్వరగా గా పనులు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయ సునీతతో పాటు మున్సిపల్ కమిషనర్ రమణబాబు తదితర అధికారులు పాల్గొన్నారు

# భర్త ఇంటిముందు భార్య బైఠాయింపు





**ప్రొద్దుటూరు,జులై 05 .అక్షర టైమ్స్ :** భర్త కాపురానికి తీసుకెళ్ళకుండా కాలయాపన చేస్తుండటంతో విసుగు చెందిన భార్య బంధువులతో కలిసి ఆదివారం ఇంటి ముందు బైఠాయించారు. వివరాలు ఇలా ఉన్నాయి ప్రొద్దుటూరు పట్టణంలోని పవర్ హౌస్ లో నివాసం ఉన్న అమూల్ ఐస్ క్రీం షాపు యజమాని షబ్బీర్ కుమారుడు షారుక్ హుస్సేన్ కు పట్టణంలోని డిసిఎస్ఆర్ కాలనీ చెందిన కరీముల్లా కుమార్తె ఆబిదా లకు ఐదేళ్ళ క్రితం వివాహమైంది. వీరికి ఒక పాప ఉంది. సాఫీగా సాగుతున్న సమయంలో షారుక్ హుస్సేన్ మరో మహిళ తో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో భార్య ఆబిదా పట్ల గత ఏడాదిన్నర కాలంగా నిర్లక్ష్యం వహిస్తూ, కొట్టడం తిట్టడం చేస్తుండటంతో విషయం తన తల్లితండ్రుల దృష్టి కి తీసుకెళ్ళిన ఆబిదా. అప్పటి నుండి పోలీసు స్టేషన్, పలువురు పెద్ద మనుషుల ఒప్పందం కుదుర్చుకున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో అత్త వారి ఇంటి ముందు బైఠాయించారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి చేరుకుని బాధితురాలికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. వారి కాగా నాలుగేళ్ల పాప గేటువద్దకు వెళ్ళి నాన్న, అబ్బా అంటూ అరవడం పలువురిని కలిచివేసింది.

# బొంతు రామ్మోహన్ జన్మదిన వేడుకలు ఘనంగా

**ప్రజా నాయకుడు బొంతు రామ్మోహన్ జన్మదిన వేడుకలు..**

**చర్లపల్లి కాంగ్రెస్ నాయకుల ప్రత్యేక శుభాకాంక్షలు**



**చర్లపల్లి,జులై 05 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి గోపగాని పాండు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చర్లపల్లి డివిజన్‌లో మాజీ జీహెచ్ఎంసీ మేయర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొంతు రామ్మోహన్ జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, పూలమాలలు వేసి, బొకేలు అందజేస్తూ ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం అభిమానులు, కార్యకర్తల సందడితో ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోడిగే ప్రభు గౌడ్ మాట్లాడుతూ, బొంతు రామ్మోహన్ ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకుడని కొనియాడారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేసే నాయకత్వం ఆయన సొంతమని అన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో, ముఖ్యంగా జీహెచ్ఎంసీ మేయర్‌గా ఉన్న సమయంలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి, యువతకు అవకాశాలు కల్పించడంలో ఆయన పాత్ర ఎంతో కీలకమని చెప్పారు.సీనియర్ నాయకులు మాట్లాడుతూ, బొంతు రామ్మోహన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చే నాయకుడని కొనియాడారు. రాజకీయాల్లో విలువలు, ప్రజాసేవ పట్ల నిబద్ధతతో ముందుకు సాగుతున్న ఆయనకు ప్రజల ఆదరణ ఎల్లప్పుడూ ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఆయన మరింత ఉన్నత స్థానాలకు చేరుకొని ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అన్నసారం పాండు ముదిరాజ్, చెన్నం గోపి, ఎస్. రాజు గౌడ్, బుడగ వెంకట్ గౌడ్, పెద్దపల్లి మధు, శ్రీనివాస్, సదానందం, భాను, జి. శివ గౌడ్, ఈదురు ముత్యాలు, రాజిరెడ్డి, నర్సిరెడ్డి, క్రాంతి కుమార్, బుడిగ శివ గౌడ్, మల్లారెడ్డి, ఆమని, గంటి శంకర్, శ్యాం ప్రసాద్, గణేష్ గౌడ్, రెహమాన్, పరుశురామ్ యాదవ్, సత్తమ్మ, సంధ్యారెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బొంతు రామ్మోహన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ముగింపులో బొంతు రామ్మోహన్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండి దీర్ఘాయుష్షుతో జీవించాలని, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు. ఈ వేడుకలు చర్లపల్లి డివిజన్‌లో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపగా, నాయకుల ఐక్యతను ప్రతిబింబించేలా ఘనంగా నిర్వహించబడ్డాయి.

# యాదవ విద్యార్థుల వసతి గృహ భూమి పూజ మహోత్సవం ఘనం

**ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ యాదవ కురుమ సహకార సంస్థ అధ్యక్షుడు రఘునాథ్ యాదవ్**

**పాల్గొన్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్,వై.ఐ.ఎఫ్ సంస్థాపకుడు చలకాని వెంకట్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీందర్ యాదవ్**





**శేర్లింగంపల్లి,జులై 05 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.ఈరన్న యాదవ జాతి అభ్యున్నతికి, విద్యా వికాసానికి సరికొత్త బాటలు వేస్తూ యాదవ చైతన్య వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణ యాదవ విద్యా దాతృత్వ సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న నూతన యాదవ విద్యార్థుల వసతి గృహ భూమి పూజ కార్యక్రమం శేర్లింగంపల్లిలో అత్యంత వైభవంగా, జనసందోహం మధ్య ఘనంగా జరిగింది. యాదవ శ్రేణుల జయజయధ్వానాలు, వేదమంత్రోచ్చారణల నడుమ ఈ శంకుస్థాపన మహోత్సవం కనులపండువగా సాగింది. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ యాదవ కురుమ సహకార సంస్థ అధ్యక్షుడు రఘునాథ్ యాదవ్ భూమి పూజ ఘట్టాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో విద్యావంతులైన యువత పాత్ర కీలకమని, మన యాదవ బిడ్డల ఉజ్వల భవిష్యత్తు కోసం రూపాయి తీసుకోకుండా ఉచిత వసతి గృహాన్ని నిర్మించాలనే గొప్ప సంకల్పం చేసిన శ్రీకృష్ణ యాదవ విద్యా దాతృత్వ సంస్థ ప్రతినిధులకు హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వసతి గృహం రాబోయే రోజుల్లో వందలాది మంది యాదవ ఉన్నతాధికారులను, రాజకీయ, పారిశ్రామిక దిగ్గజాలను తయారుచేసే విద్యా దేవాలయంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ గంభీరమైన వేడుకలో యాదవ జన హృదయ నేత, మాజీ మంత్రివర్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ (శ్రీనన్న) ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యాదవ యువతకు దిక్సూచిగా నిలుస్తున్న వై.ఐ.ఎఫ్ సంస్థాపకుడు చలకాని వెంకట్ యాదవ్, యాదవ హక్కుల పోరాట యోధుడు, అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ అధ్యక్షుడు చింతల రవీందర్ యాదవ్ లతో పాటు యాదవ చైతన్య వేదిక ప్రతినిధులు, వివిధ యాదవ సంఘాల అగ్రనాయకులు, ప్రజాప్రతినిధులు, యాదవ సోదరులు సముద్రమంత సంఖ్యలో తరలివచ్చి భూమి పూజను విజయవంతం చేశారు. యాదవ జాతి ఐక్యతకు, విద్యా సంకల్పానికి ఈ కార్యక్రమం ఒక సజీవ సాక్ష్యంగా నిలిచింది.

# ధరణిలో దొంగలు - 10 వేల ఎకరాలు స్వాహా!

**ధరణి పోర్టల్‌పై విచారణలో సంచలన విషయాలు**

**10 వేల ఎకరాలపై దొడ్డిదారిన హక్కుల మార్పిడి**

**భూదోపిడీకి సీసీఎల్‌ఏలోని ఇద్దరి సహకారం**

**పోలీసుల అదుపులో పలువురు అక్రమార్కులు**




ధరణి పోర్టల్‌లో జరిగిన అక్రమాలపై సంచనల విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సాంకేతిక లోపాలను అడ్డుపెట్టుకుని 10 వేల ఎకరాల భూములకు సంబంధించిన హక్కులను దొడ్డిదారిన మార్చేసినట్లు విచారణలో గుర్తించారు. ఈ అక్రమాలకు సీసీఎల్ఏలోని ఇద్దరు సహా జిల్లాల్లో కొందరు సహకరించినట్లు తేల్చారు. పోలీసులు పలువురు అక్రమార్కులను అదుపులోకి తీసుకునట్లు తెలుస్తోంది.సాగు భూముల రిజిస్ట్రేషన్లు-మ్యుటేషన్ల పోర్టల్ ధరణిలో 10 వేల ఎకరాల అక్రమాలు చోటు చేసుకుంది. పోర్టల్‌లోని లొసుగుల ఆధారంగా విలువైన భూములున్న ప్రాంతాల్లో వేల ఎకరాలకు సంబంధించిన హక్కులను దొడ్డిదారిన మార్చేశారు. ప్రధానంగా ఎకరా కోట్ల ధర పలికే రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతోపాటు సిద్దిపేట, రాజన్న-సిరిసిల్ల, జయశంకర్-భూపాలపల్లి జిల్లాల్లో భూఅక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈ భూదోపిడీకి సీసీఎల్ఏకు సంబంధించిన ఇద్దరు సహకారం అందించినట్లు తెలుస్తోంది. వివిధ జిల్లాల్లోని సిబ్బంది సైతం వారి బాటలో నడిచినట్లు తెలిసింది. దీనిపై విచారణ చేస్తున్న పోలీసులు ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.ధరణిలో సాధారణంగా జరిగే ప్రక్రియ లేకుండా, దస్త్రాలను వాడకుండా భూములపై యాజమాన్య హక్కులు మారినట్లు పలు జిల్లాల్లో కలెక్టర్ల దృష్టికి వచ్చింది. దీనిపై సాంకేతిక, రెవెన్యూ చట్టాల నిపుణులతో అధ్యయనం చేయించి, ప్రాథమిక సమాచారం సేకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సైబర్ క్రైం, ఐటీ విభాగాల వారితోనూ పరిశీలింపజేసింది. ఈ క్రమంలో పెద్దఎత్తున భూముల హక్కులు దారి మళ్లినట్లు గుర్తించింది. మరింత లోతుగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలంటూ రెండు రోజుల క్రితం ఐఏఎస్ అధికారులు, సైబర్ క్రైం, ఐటీ, ఎన్ఐసీ తదితర విభాగాల ప్రతినిధులతో ఉన్నతస్థాయి బృందాన్ని ఏర్పాటు చేసింది. వారు దస్త్రాలను పరిశీలించగా ఎసైన్డ్, ప్రభుత్వ, మిగులు, భూదాన్ భూములతోపాటు వివాదాల్లో ఉన్న పట్టా భూముల్లోనూ వేల కొలది ఎకరాల దోపిడీ జరిగినట్లు తేల్చారు.మేడ్చల్ జిల్లా రావెల్‌కోల్‌లోని నాలుగు పార్శిళ్లలో ఎకరాల కొద్దీ భూములు వేరే వారి పేర్లపైకి మారినట్లు గుర్తించారు. ఒకచోట 16 ఎకరాలు, మరోచోట 15.28 ఎకరాలు ఇతరుల పేర్లపైకి మారినట్లు తేల్చారు. రంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాల్లో, సిద్దిపేట జిల్లా కుక్కునూరుపల్లి మండలంలో విలువైన భూములు, జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో కొన్ని పట్టా భూములు ఇతరుల పేర్లపైకి మారాయి. వికారాబాద్, మహబూబ్‌నగర్, ఉమ్మడి నల్గొండ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఈ అక్రమం ఆనుపానులు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అయితే ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడా మార్పు చేర్పులు జరగలేదు.ధరణి పోర్టల్ సాంకేతికతలోని లొసుగులను గుర్తించిన పలువురు వ్యక్తులు అక్రమానికి తెరలేపినట్లు తెలిసింది. మీ-సేవా, తహసీల్దారు-సంయుక్త సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు దస్త్రాలు ఏవీ రాకున్నా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో వివిధ కార్యాలయాల్లోని సిబ్బంది సాయం తీసుకుని హక్కులను మార్చేసినట్లు అంచనాకు వచ్చారు.


# ఈ పెళ్లి ఎలాగూ జరగదంటూ నెల ముందే ఫ్రెండ్‌కు సియా మెసేజ్

**కేతన్ అగర్వాల్ హత్య కేసులో మరో ట్విస్ట్**

**పుణె రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య కేసులో కీలక పరిణామం**

**పెళ్లి జరగదని స్నేహితురాలికి ముందే మెసేజ్ చేసిన సియా గోయల్**

**మరోవైపు గుండెపోటుతో మరణించిన కేతన్ అగర్వాల్ తాత**



మహారాష్ట్ర పుణెకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కేతన్ అగర్వాల్ హత్య కేసు దర్యాప్తులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా నిందితురాలు సియా గోయల్ హత్యకు దాదాపు నెల రోజుల ముందే తన స్నేహితురాలికి 'ఈ పెళ్లి జరగదు' అంటూ స్నాప్‌చాట్‌లో మెసేజ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మెసేజ్- హత్యకు చాలా కాలం ముందే కుట్ర పన్నినట్లు అనుమానాల్ని బలపరుస్తోందని అధికారులు భావిస్తున్నారు. ఇదే సమయంలో కేతన్ తాత దేవీచంద్ అగర్వాల్ గుండెపోటుతో మృతి చెందడం కుటుంబంలో మరో విషాదాన్ని మిగిల్చింది.పోలీసుల సమాచారం ప్రకారం మే నెలలో సియా గోయల్ తన స్నేహితురాలికి స్నాప్‌చాట్‌లో ఒక సందేశం పంపింది. నవంబరులో ఉదయ్‌పూర్‌లో జరగాల్సిన వివాహానికి అతిథుల టికెట్లు బుక్ చేయడానికి ఆధార్ కార్డ్ కాపీ పంపాలని కోరుతూ ఒక మెసేజ్ చేసింది. 'పెళ్లికి టికెట్లు బుక్ చేయడం కోసం నీ ఆధార్ కార్డు ముందు, వెనుక ఫొటోలు పంపు. ఈ పెళ్లి ఎలాగూ జరగదు. అయినా పంపు.' అని సియా మెసేజ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అప్పటికే కేతన్ కుటుంబం- బంధువులు, స్నేహితుల ప్రయాణ ఏర్పాట్ల కోసం అతిథుల పేర్లు, ఆధార్ వివరాలు సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సియా తరఫున బంధువుల వివరాలు కూడా అడిగినట్లు చెప్పారు.ఇక ఈ స్నాప్‌చాట్ సందేశం నిజమైనదేనా అనే విషయాన్ని పోలీసులు సాంకేతికంగా పరిశీలిస్తున్నారు. అలాగే సియా స్నేహితురాల్ని విచారించి- కేతన్ హత్య గురించి ముందే తెలుసా, సియా పెళ్లి జరగదని ఎందుకు చెప్పింది, తన ప్లాన్ విషయాన్ని సియా ఎప్పుడైనా చెప్పిందా అనే అంశాలపై సమాచారం సేకరించనున్నట్లు తెలుస్తోంది.కేతన్ అగర్వాల్ హత్య కేసులో 20 ఏళ్ల సియా గోయల్, 22 ఏళ్ల చేతన్ చౌదరిని పోలీసులు గత నెలలో అరెస్ట్ చేశారు. దర్యాప్తు ప్రకారం జూన్ 18న పుణె సమీపంలోని లోహ్‌గడ్ కోటకు కేతన్ అగర్వాల్‌ను తీసుకెళ్లారు. అక్కడ లోయలోకి తోసి హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ప్రమాద వశాత్తు కిందపడిపోయినట్లు చిత్రీకరించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం సియాకు ఈ పెళ్లి చేసుకోవడం ఇష్టం లేకపోయినా కుటుంబ సభ్యుల ఒత్తిడి వల్లే వివాహానికి అంగీకరించినట్లు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే హత్యకు ప్లాన్ చేసినట్లు భావిస్తున్నారు. కేసు పురోగతిలో భాగంగా సియా గోయల్, చేతన్ చౌదరి ఫోన్ సంభాషణలు, చాట్స్ సహా ఇతర కీలక డేటాను సేకరిస్తున్నారు. ప్రస్తుతం వీరిద్దరూ పోలీసుల కస్టడీలోనే ఉన్నారు.దర్యాప్తులో భాగంగా పోలీసులు కీలక ఆధారాలు సేకరిస్తున్నారు. గురువారం రోజు పుణెలోని ఉల్లానగర్ ప్రాంతానికి సియా గోయల్‌ను తీసుకెళ్లి, అక్కడ హత్య ప్రణాళికకు సంబంధించిన రిహార్సల్ జరిగినట్లు భావిస్తున్న ప్రదేశాన్ని పోలీసులు ఇప్పటికే పరిశీలించారు. హత్య జరిగిన రోజు సియా గోయల్ వేసుకున్న దుస్తుల్ని వారి ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు బుధవారం రోజు చేతన్ చౌదరిని లోహ్‌గడ్ కోటకు తీసుకెళ్లి కేతన్ బరువుతో సమానమైన డమ్మీ సహాయంతో ఘటనను రీక్రియేట్ చేశారు. నేరం ఎలా జరిగిందో అధికారులు పరిశీలించారు. సియా తండ్రి ప్రవీణ్ గోయల్ మాట్లాడుతూ పోలీసులు తమ ఇంటికి వచ్చినప్పటికీ తనను ఎలాంటి ప్రశ్నలు అడగలేదన్నారు. 'పోలీసులు సుమారు 30 నుంచి 45 నిమిషాల పాటు ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. పోలీసులు నన్ను ఏం ప్రశ్నించలేదు.' అని తెలిపారు.మరోవైపు ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగానే కేతన్ అగర్వాల్ తాత దేవీచంద్ అగర్వాల్ (71) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యుల ప్రకారం కేతన్ మరణం తర్వాత ఆయన తీవ్ర మనోవేదనకు గురయ్యారు. కొద్ది రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గుండెపోటుతో కన్నుమూశారు. దీంతో ఇప్పటికే కేతన్ చనిపోయిన బాధలో ఉంటే మరో విషాదం నెలకొంది.

# తెలంగాణలో ఘోర రోడ్డు ప్రమాదం

**నలుగురు ఏపీ వాసులు మృతి**

**నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం**

**కారును ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు, కారులోని నలుగురు మృతి**

**మృతులు కాకినాడ జిల్లా వాసులుగా గుర్తింపు**




తెలంగాణలోని నల్గొండ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ఏపీ వాసులు మృతిచెందారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద జాతీయరహదారిపై హైదరాబాద్ వెళ్తున్న కారును ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్ననలుగురు మృతి చెందారు. దీనిపై సమాచారం అందుకున్న చిట్యాల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.తీవ్రంగా గాయపడిన ఎస్‌బీఐ ఉద్యోగి ప్రసాద్‌ను నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులు తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన ఎస్‌బీఐ ఉద్యోగి ప్రసాద్ భార్య, కుమార్తె(15), కుమారుడు(10), ప్రసాద్ స్నేహితుడు శ్రీకర ప్రసాద్(62)గా గుర్తించారు. ఈ ఘటనపై చిట్యాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏలూరు జిల్లాలో విషాదం

**రైలు ఢీకొని నలుగురి మృతి**

**చేబ్రోలు స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని నలుగురు మృతి**

**మృతుల్లో ముగ్గురు మహిళలు, యువకుడు ఆత్మహత్య లేదా ప్రమాదమా అనే కోణంలో పోలీసుల దర్యాప్తు**



ఏలూరు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఉంగుటూరు మండలంలో చేబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి రైలు ఢీకొని నలుగురు మృతి చెందారు. మృతుల్లో ఒక పురుషుడు, ముగ్గురు మహిళలు ఉన్నారు. చర్లపల్లి నుంచి షాలిమార్ వెళ్తున్న ప్రత్యేక రైలు వీరిని ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు మృతదేహాలు ఛిద్రమవడంతో గుర్తు పట్టలేని విధంగా ఉన్నాయి. సమాచారం అందుకున్న తాడేపల్లిగూడెం జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు.వీరు ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని, ఒకే కుటుంబానికి చెందిన వారై ఉంటారని రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుల వయసు 30 నుంచి 35 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. ఓ మహిళా మృతదేహం వద్ద లభించిన ఏటీఎం కార్డుపై షేక్ హసీనా అని ఉంది. మరో మహిళ వద్ద తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపోలో బైక్ పార్క్ చేసిన రసీదు గుర్తించారు. ఘటనా స్థలిలో రెండు ఫోన్లు లభించినప్పటికీ అవి ధ్వంసమయ్యాయి. వాటి సిమ్‌కార్డులు వేరే సెల్‌ఫోన్‌లో వేసి మృతులు ఎవరనేది ఆరా తీస్తున్నారు. మృతదేహాలను తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించామని జీఆర్పీ ఎస్ఐ అప్పారావు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# సముద్రంలో మత్స్యకారుల గల్లంతు

**ఒకరు క్షేమం, మరో ఆరుగురి కోసం గాలింపు**

**సముద్రంలో గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల్లో ఒకరు క్షేమం**

**బోటు యజమాని కారె చిన్నను కాపాడి ఒడ్డుకు తరలించిన సహాయబృందాలు**

**మత్స్యకారుల గల్లంతుపై ఉన్నతాధికారులతో మాట్లాడిన సీఎం చంద్రబాబు**

విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారుల్లో ఆరుగురు సముద్రంలో గల్లంతయ్యారు. ఈనెల 1న ఫిషింగ్ హార్బర్ నుంచి విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముక్కాంకు చెందిన అప్పలరాజు, కె.చిన్నయ్య, చిన్న, గరగయ్య, సీతోడు, విశాఖ జిల్లా భీమిలి మండలం పెదనాగమయ్యపాలేనికి చెందిన బండియ్య, విశాఖకు చెందిన చిన్నఅమ్మోరుగా బోటులో చేపల వేటకు వెళ్లారు.అయితే శనివారం సాయంత్రానికి వేటకువెళ్లిన ఏడుగురు ఒడ్డుకు చేరుకోవాల్సి ఉంది. అయితే శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో మత్స్యకారులు చివరిసారిగా కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆ తర్వాత నుంచి వారి ఫోన్లు పని చేయలేదు. అనుకున్న సమయానికి బోటు ఒడ్డుకు చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే వారు కోస్ట్, మెరైన్ పోలీసులకు సమాచారమిచ్చారు. తమ వారి సమాచారం కోసం వారంతా ఫిషింగ్ హార్బర్ వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరవుతున్నారు.సుమారుగా 50 మైళ్ల దూరం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లారు. పూడిమడక పరిసర ప్రాంతాల్లో వేట కొనసాగించారు. చివరిసారిగా గంగవరం పోర్టు సమీపం నుంచి ఇంట్లో వారితో మాట్లాడారు. అలలు ఉద్ధృతికి బోటు ఏదైనా ఒడ్డుకి కొట్టుకుని పోయిందా అని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గల్లంతైన జాలర్ల కోసం ముమ్మరంగా సాగుతున్న గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కోస్ట్ గార్డ్, నావీ అధికారులు రంగంలోకి దిగారు. గజ ఈతగాళ్ల బృందం సముద్రంలోకి వెళ్లింది. మత్స్యకారులు వేట కొనసాగించిన ప్రాంతంలో గాలింపు చేస్తున్నారు. నేవీ హెలికాప్టర్‌తోనూ గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో వేటకు వెళ్లిన ఏడుగురులో ఒకరు క్షేమంగా దొరికారు. బోటు యజమాని చిన్నను క్షేమంగా ఒడ్డుకు తీసుకువస్తున్నారు. మరో ఆరుగురి కోసం గాలింపు కొనసాగుతోంది.మత్స్యకారుల గల్లంతుపై ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. జాలర్లను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. కోస్టుగార్డు నౌకలతో గాలింపు ముమ్మరం చేయాలని ఆదేశించారు. నేవీ హెలికాప్టర్ల ద్వారా రెస్క్యూ ఆపరేషన్ విస్తృతం చేశామని అధికారులు, చంద్రబాబుకు తెలియజేశారు. గాలింపు చర్యలను సమన్వయం చేసుకోవాలని మెరైన్ ఐజీపీ, విశాఖ సీపీలకు సీఎం ఆదేశాలిచ్చారు. అలాగే గాలింపు చర్యలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు.మత్స్యకారుల గల్లంతుపై మంత్రులు ఆరా తీశారు. ఈ మేరకు కలెక్టర్, ఎస్పీ, అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గల్లంతైన వారి కోసం యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. తీర ప్రాంతానికి దగ్గరలోనే ఉండడంతో జాలర్లకు ఎలాంటి ఇబ్బంది ఉండదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మత్స్యకారులను క్షేమంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని చెప్పారు.మత్స్యకారుల గల్లంతుపై హోంమంత్రి అనిత ఆరా తీశారు. ఈ మేరకు కలెక్టర్, ఎస్పీ, మత్స్య శాఖ అధికారులతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. కోస్టుగార్డ్ నౌకలతో గాలింపు ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశించారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అనిత భరోసా ఇచ్చారు.

## వర్షం పడగానే నేరేడు పండ్లు తింటే ఏమవుతుందో తెలుసా..? మన పెద్దలు చెప్పిన ఈ నిజాలు తెలుసుకోండి..



నేరేడు పండ్లను వర్షం కురిసిన వెంటనే వీటిని తింటే మాత్రం హాస్పిటల్ పాలు కావడం ఖాయం అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తుల సమస్యలు, దగ్గు, ఆస్తమా ఉన్నవాళ్లు ఈ ఊదా రంగు పండుకు ఈ సీజన్లో ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. అసలు వర్షపు నీటిలో నానిన నేరేడు పండ్లు కడుపులోకి వెళ్తే ఏం జరుగుతుంది? అనేది తెలుసుకుందాం..

వర్షాకాలంలో రోడ్ల పక్కన మెరిసిపోయే అల్ల నేరేడు పండ్లు అందరినీ ఆకర్షిస్తాయి. చూడగానే నోరూరించే ఈ పండులో ఎన్నో అద్భుతమైన పోషక విలువలు, యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. అయితే నేరేడు పండ్ల విషయంలో మన తాతముత్తాతలు ఒక కఠినమైన నియమాన్ని చెబుతుంటారు. అదేమిటంటే.. వర్షం పడిన వెంటనే ఈ పండ్లను అస్సలు తినకూడదు. వినడానికి ఇది మూఢనమ్మకంలా అనిపించినా.. దీని వెనుక దాగున్న అసలు ఆరోగ్య రహస్యాలు ఉన్నాయి. వర్షం పడినప్పుడు వాతావరణంలో తేమ విపరీతంగా పెరుగుతుంది. ఈ సమయంలో నేరేడు పండు పల్చని తొక్కపై చిన్న చిన్న బ్యాక్టీరియా, శిలీంధ్రాలు వేగంగా వృద్ధి చెందుతాయి. నేరేడు పండ్ల ఉపరితలంపై ఉండే సూక్ష్మ రంధ్రాలలో ఇవి దాక్కుంటాయి. మనం ఎంత బాగా కడిగినా ఈ సూక్ష్మజీవులు పూర్తిగా పోవు. వర్షంలో నానిన ఈ పండ్లను అలాగే తినడం వల్ల ఆ మురికి, బ్యాక్టీరియా నేరుగా కడుపులోకి ప్రవేశించి తీవ్రమైన ఇన్‌ఫెక్షన్లకు కారణమవుతాయి.

ఊపిరితిత్తుల సమస్యలు.. దగ్గు ఉన్నవారు దూరం ఉండాలి

ఆస్తమా, అలర్జీలు లేదా ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవారు వర్షాకాలంలో నేరేడు పండ్లకు దూరంగా ఉండటమే మంచిది. నేరేడు పండుకు సహజంగానే శరీరాన్ని చల్లబరిచే గుణం ఉంటుంది. వర్షాకాలపు చల్లని వాతావరణానికి తోడు ఈ పండును తింటే ఊపిరితిత్తులలోని నరాలు సంకోచించే ప్రమాదం ఉంది. తేలికపాటి జలుబు లేదా దగ్గు ఉన్నప్పుడు వర్షంలో నానిన నేరేడు పండ్లు తింటే గొంతులో కఫం పెరిగి, దగ్గు తీవ్రత రెట్టింపు అవుతుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవడమే కాకుండా ఆస్తమా అటాక్ వచ్చే ఛాన్స్ కూడా పెరుగుతుంది.

మందగించే జీర్ణశక్తి.. కడుపు నొప్పి..

వర్షాకాలంలో మన శరీర జీర్ణక్రియ సహజంగానే కొంచెం నెమ్మదిగా సాగుతుంది. వర్షపు నీటిని పీల్చుకుని తమ సహజ గుణాన్ని మార్చుకున్న నేరేడు పండ్లను ఈ సమయంలో తినడం వల్ల కడుపు నొప్పి, గ్యాస్, అజీర్తి లేదా విరేచనాలు వంటి జీర్ణ సమస్యలు తలెత్తుతాయి. ఇవి జీర్ణశక్తిని మరింత మందగింపజేస్తాయి.

నిపుణులు ఇచ్చే సలహా ఏంటి?

నేరేడు పండ్లు ఆరోగ్యానికి చాలా మంచివి. కానీ వాటిని తినేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి. వర్షం పడిన వెంటనే చెట్ల నుండి కోసిన లేదా రోడ్డు పక్కన తడిసిన పండ్లను అస్సలు కొనకండి. పొడిగా, తాజాగా ఉన్న పండ్లను తెచ్చుకుని.. కాసేపు ఉప్పు నీటిలో బాగా కడిగి, ఆ తర్వాతే తినాలి. ఖాళీ కడుపుతో కాకుండా, ఏదైనా తిన్న తర్వాత మాత్రమే నేరేడు పండ్లను తీసుకోవడం సురక్షితం.

## సంతాన భాగ్యానికి ఎన్నెన్ని చిక్కులో!

# మంచి జీవనశైలితో సాధ్యమట!

**రోజురోజుకూ పెరుగుతోన్న "సంతాన లేమి సమస్యలు" కారణాలేంటి? పరిష్కారాలు ఎలా?**



ఎంత చదువుకున్న, ఏ స్థాయికి ఎదిగిన, ఎన్ని సాధించిన 'అమ్మా, నాన్న' పిలుపును కోరుకోని వారు ఉండరు. కానీ, మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు, అధిక రేడియేషన్, ఆలస్యంగా వివాహం చేసుకోవడం వంటి కారణాల చేత చాలా మంది ఈ పిలుపుకు దూరమవుతున్నారు. ఈ క్రమంలోనే గర్భధారణ కోసం ఎంత ప్రయత్నిస్తున్నా.. చాలా మందిలో ఫలితం కనిపించడం లేదట. ఇలాంటి సమయంలో జీవనశైలి ఎలా ఉందో చూసుకోవటం మంచిదంటున్నారు నిపుణులు. ఎందుకంటే సంతానం కలగకపోవటం అనేది ఏదో ఒక్క సమస్యతో ముడిపడి ఉండదని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో మంచి జీవనశైలితో సంతాన భాగ్యం ఎలా పొందాలో ఇప్పుడు తెలుసుకుందాం! సంతానలేమి పై తీవ్రమైన మానసిక ఒత్తిడి, దీర్ఘకాలంగా నిద్రలేమి, ఎక్కువగా మొబైల్ ఫోన్లు, ల్యాప్ టాప్ లను చూడటం, వేళకు ఆహారం తినకపోవటం, పొగ తాగటం, మద్యం అలవాటు, భార్యభర్తల మధ్య ఆత్మీయత తగ్గటం వంటి రకరకాల అంశాలు ప్రభావం చూపుతాయంటున్నారు నిపుణులు.

### సరైన ఆహారం తీసుకోకపోవడం :

ఆరోగ్యవంతమైన అండం, వీర్య కణాల తయారీలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవితాల్లో కాల్స్, మీటింగ్స్ హాజరు కావటం, ప్రయాణాలు చేయటం, లక్ష్యాలను చేరుకోవటం లాంటివి వల్ల సమయానికి భోజనం చేయకుండా ఉంటున్నారట. సమోసాలు, బర్గర్లు, పిజ్జాలు వంటివి తిని అప్పటికి ఆకలిని తీర్చుకుంటారని పేర్కొంటున్నారు. ఇవన్నీ సంతానాన్ని దూరం చేసే అలవాట్లు అని చెబుతున్నారు. అందుకే గర్భం ధరించడానికి ప్రయత్నిస్తున్న మహిళలు తృణధాన్యాలు, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, చేపలను ఆహారంగా తీసుకోవాలని.. ట్రాన్స్ ఫ్యాట్స్, రెడ్ మీట్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ఝుతీఝుతీస సూచిస్తోంది.

### ఆఫీసు ఒత్తిడి :

చాలా మంది భార్యాభర్తలు శారీరకంగా దగ్గరగా ఉన్నా ఆలోచనలన్నీ ఉద్యోగ వ్యవహారాల చుట్టే తిరుగుతుంటాయని నిపుణులు చెబుతున్నారు. మెయిల్స్ చెక్ చేసుకోవటం, లక్ష్యాల గురించి చింతించటం ద్వారా పని ఒత్తిడిని పడక గది వద్దకు తీసుకొస్తుంటారని పేర్కొంటున్నారు. ఒత్తిడి ఒక్కటే వంధ్యత్వానికి కారణం కావడం అసంభవం అయినప్పటికీ, అది గర్భం దాల్చే మహిళ సామర్థ్యానికి ఆటంకం కలిగిస్తుందని పేర్కొంది. ఆందోళనగా ఉంటే : కంటి నిండా నిద్రపోవటం, హార్మోన్ల సమతుల్యత, అండం విడుదల కావటం, వీర్యం ఉత్పత్తి వంటి శారీరక క్రియలు లయ బద్ధంగా సాగుతుంటాయని నిపుణులు చెబుతున్నారు. శరీరం, మనసు ఎప్పుడూ అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేలా, ఆందోళనతో నిండిపోతే లైంగిక ఆరోగ్యమే దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి ఆందోళనను తగ్గించుకోవాలని సూచిస్తున్నారు.

### మద్యం :

ఈ రోజుల్లో మద్యం తాగటం మాములు విషయంగా మారింది. ఇది ఒత్తిడిని తగ్గిస్తుందో? లేదో? కానీ సంతానం కోసం ప్రయత్నించే వారికి చేటే చేస్తుందంటున్నారు నిపుణులు. అధికంగా మద్యం సేవించడం వల్ల సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గవచ్చని ఝుఎశీఎశ్రీఱఅఱఎ పేర్కొంది.

### అతిగా చేస్తే :

ప్రస్తుతం చాలా మంది ఫిట్ నెట్ పై ఎక్కువ దృష్టి పెడుతున్నారు. ఈ క్రమంలో క్రాష్ డైట్స్, కొవ్వు కరిగించే, టెస్టోస్టిరాన్ ను పెంచే మందులు, నియంత్రణలో లేని జిమ్ సాధనాలు, సామర్థ్యానికి మించి చేసే వ్యాయమాలూ చేస్తున్నారట. ఇవి హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తాయని నిపుణులు చెబుతున్నారు. వీర్యం ఉత్పత్తిని అస్తవ్యస్తం చేస్తాయంటున్నారు.

### జీవనశైలిలో మార్పు :

ఇలాంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని చూస్తే జీవనశైలిని సరిదిద్దుకోవటం చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. సరైన పోషకాహారం తినటం, వేళకు భోజనం చేయటం, రాత్రిపూట కంటి నిండా నిద్రించటం మంచిదంటున్నారు. వ్యాయామం, యోగా, ధ్యానం, ప్రాణాయామం, శ్రావ్యమైన సంగీతాన్ని వినటం వంటి వాటితో మానసిక ఒత్తిడిని తగ్గించుకునే ప్రయత్నం చేయాలని సలహా ఇస్తున్నారు. అలాగే, సంతానం కోసం ప్రయత్నించటానికి ముందే డాక్టర్ ను సంప్రదించటమూ మంచిదంటున్నారు.

## మీ ఇంట్లో తులసి చెట్టు ఉందా.. ఈ విషయాలు తెలిస్తే ఎగిరి గంతేస్తారు..



మీరు ప్రతిరోజూ ఒత్తిడి, అజీర్తి లేదా బ్లడ్ షుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్నారా? అయితే రూపాయి ఖర్చు లేకుండా వీటన్నింటికీ చెక్ పెట్టే ఒక అద్భుతమైన సంజీవని మీ ఇంట్లోనే ఉంది. అదే తులసి మొక్క. నిత్యం మనం పూజించే తులసి ఆకులను ఉదయాన్నే ఖాళీ కడుపుతో తీసుకుంటే.. మన శరీరంలో రోగనిరోధక శక్తి కొండంత పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

భారతీయ సంస్కృతిలో ప్రతి ఇంటి ముంగిట కొలువై ఉండే పవిత్ర మొక్క తులసి. హిందూ మతంలో లక్ష్మీ స్వరూపంగా పూజలందుకునే తులసి మొక్కకు.. ఆధ్యాత్మికంగా ఎంత ప్రాధాన్యత ఉందో, ఆయుర్వేదంలో అంతకు మించిన ఔషధ గుణాలు ఉన్నాయి. తులసి ఆకులలో విటమిన్ ఎ, సి, కె లతో పాటు కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్, ఐరన్ వంటి కీలక పోషకాలు, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా తులసి ఆకులను తీసుకోవడం శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మంచిది. తులసి ఆకులు శరీరాన్ని లోపలి నుండి శుభ్రపరచడమే కాకుండా ఇమ్యూనిటీని కొండంత బలోపేతం చేస్తాయి. వాతావరణ మార్పుల వల్ల వచ్చే జలుబు, దగ్గు, గొంతు నొప్పి, శ్వాసకోశ సమస్యల నుండి తులసి ఆకులు తక్షణ ఉపశమనాన్ని కలిగిస్తాయి. శరీరానికి ఇన్‌ఫెక్షన్లతో పోరాడే శక్తినందిస్తాయి.

ఒంటికి, మనసుకు ఒత్తిడి దూరం..

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడి పెద్ద సమస్యగా మారింది. తులసిలో ఉండే అడాప్టోజెనిక్ గుణాలు శరీరంలో కార్టిసాల్ అనే ఒత్తిడి హార్మోన్ స్థాయిలను అద్భుతంగా నియంత్రిస్తాయి. ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున తులసి ఆకులను నమలడం లేదా తులసి టీ తాగడం వల్ల ఆందోళన, చింత, కుంగుబాటు వంటి మానసిక సమస్యలు తగ్గి మనశ్శాంతి లభిస్తుంది.

జీర్ణవ్యవస్థ పదిలం

తులసి ఆకులలో సహజసిద్ధమైన యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ, జీర్ణ గుణాలు ఉన్నాయి. ఇవి గ్యాస్, అజీర్ణం, కడుపు నొప్పి, మలబద్ధకం వంటి పొట్ట సమస్యలను సమూలంగా నయం చేస్తాయి. ఖాళీ కడుపుతో వీటిని తీసుకోవడం వల్ల కడుపు చల్లబడటమే కాకుండా, పేగుల్లోని మంచి బ్యాక్టీరియా సమతుల్యత దెబ్బతినకుండా ఉండి జీర్ణక్రియ మెరుగుపడుతుంది.

రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ

మధుమేహం ఉన్నవారికి తులసి ఆకులు ఒక సంజీవని లాంటివి. ఇవి శరీరంలోని ఇన్సులిన్ స్థాయిలను సమతుల్యం చేసి, రక్తంలో చక్కెర శాతాన్ని అదుపులో ఉంచుతాయి. వీటిని క్రమం తప్పకుండా డైట్‌లో చేర్చుకోవడం వల్ల భవిష్యత్తులో డయాబెటిస్ బారిన పడే ప్రమాదం చాలా వరకు తగ్గుతుంది.

పదిలమైన గుండె ఆరోగ్యం

తులసి ఆకులు శరీరంలో రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను సమర్థవంతంగా నియంత్రిస్తాయి. రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచడం ద్వారా గుండె జబ్బులు, పక్షవాతం వంటి ముప్పులను నివారిస్తాయి. గుండె పనితీరును మెరుగుపరచడంలో తులసి కీలక పాత్ర పోషిస్తుంది.

గాలి శుద్ధి సానుకూల శక్తి

ఆరోగ్యానికే కాకుండా ఇంటి వాతావరణాన్ని మార్చడంలో తులసి అగ్రస్థానంలో ఉంటుంది.

గాలిని శుద్ధి చేస్తుంది: తులసి మొక్క రోజంతా ఆక్సిజన్‌ను విడుదల చేస్తూ, గాలిలోని విష వాయువులను గ్రహిస్తుంది. ఈ మొక్క నుండి వచ్చే సువాసన వల్ల దోమలు, ఈగలు, ఇతర కీటకాలు ఇంట్లోకి రాకుండా నివారించవచ్చు.

పాజిటివ్ ఎనర్జీ:

తులసి మొక్క ఉన్న ప్రదేశం ప్రశాంతతతో, సానుకూల ప్రకంపనలతో నిండి ఉంటుంది. ఉదయం,

## ప్రతిరోజూ 100 గ్రాముల చికెన్ తింటే జరిగే అద్భుతమిదే.. ప్రోటీన్‌కు బెస్ట్ ఫుడ్స్ ఏంటో తెలుసా..?



ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రోటీన్ అత్యంత కీలకమైన పోషకం. కేవలం 100 గ్రాముల చికెన్ బ్రెస్ట్‌లోనే దాదాపు 28 గ్రాముల అధిక నాణ్యత గల ప్రోటీన్ లభిస్తుంది. ఇది కండరాల నిర్మాణం, కణాల మరమ్మత్తు, శక్తి ఉత్పత్తికి ఎంతో సహాయపడుతుంది. చికెన్, చేపలు, గ్రీక్ యోగర్ట్, లో-ఫ్యాట్ పనీర్, సోయా ఉత్పత్తులు వంటి క్లాస్-1 ప్రోటీన్ వనరులు శరీరానికి అవసరమైన అన్ని ఎసెన్షియల్ అమైనో ఆమ్లాలను అందిస్తాయి.

ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రోటీన్ అత్యంత కీలకమైన పోషకం. కండరాల నిర్మాణం, కణాల మరమ్మత్తు, ఎంజైమ్‌లు, హార్మోన్ల ఉత్పత్తికి ఇది అనివార్యం. మన శరీరానికి సరిపడా ప్రోటీన్ లభించినప్పుడు, అది రోజంతా శక్తివంతంగా పనిచేయడానికి సహాయపడుతుంది. ఈ నేపథ్యంలో, వివిధ ప్రోటీన్ వనరులు, వాటి నాణ్యత, సరైన వినియోగం గురించి ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారో ఈ కథనంలో తెలుసుకుందాం..

100 గ్రాముల చికెన్ బ్రెస్ట్ నుండి అద్భుతమైన ప్రోటీన్

ప్రోటీన్ వనరులలో చికెన్ బ్రెస్ట్ చాలా ప్రసిద్ధి చెందింది. కేవలం 100 గ్రాముల చికెన్ బ్రెస్ట్ నుండి దాదాపు 28 గ్రాముల అధిక-నాణ్యత గల ప్రోటీన్ లభిస్తుంది. ఇది మన దైనందిన ప్రోటీన్ అవసరాలలో గణనీయమైన భాగాన్ని తీర్చగలదు. చేపలు కూడా ఇలాంటి అధిక నాణ్యత గల ప్రోటీన్‌ను అందిస్తాయి.

ప్రోటీన్ వర్గీకరణ: క్లాస్ 1 క్లాస్ 2 ప్రోటీన్లు

ప్రోటీన్‌లను వాటి పోషక విలువ ఆధారంగా క్లాస్ 1 క్లాస్ 2 గా వర్గీకరిస్తారు. క్లాస్ 1 ప్రోటీన్: ఇందులో మన శరీరానికి అవసరమైన తొమ్మిది ఎసెన్షియల్ అమైనో ఆమ్లాలు సరైన నిష్పత్తిలో ఉంటాయి. ఇవి శరీరానికి బాగా అందుబాటులో ఉంటాయి (బయో-అవైలబిలిటీ ఎక్కువ). చికెన్, చేపలు వంటి జంతు ఆధారిత ప్రోటీన్లు, అలాగే కొన్ని పాల ఉత్పత్తులు, సోయా ఉత్పత్తులు ఈ కోవలోకి వస్తాయి.

క్లాస్ 2 ప్రోటీన్: ఇందులో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఎసెన్షియల్ అమైనో ఆమ్లాలు తక్కువగా లేదా మిస్ అయి ఉండవచ్చు. సంపూర్ణ అమైనో ఆమ్ల ప్రొఫైల్ పొందడానికి వీటిని ఇతర ప్రోటీన్ వనరులతో కలిపి తీసుకోవడం అవసరం. చాలా పప్పు దినుసులు, తృణధాన్యాలు క్లాస్ 2 ప్రోటీన్ల కిందకు వస్తాయి.

శాఖాహారులకు ప్రోటీన్ వనరులు

భారతదేశంలో చాలా మంది లాక్టో-వెజిటేరియన్లు ఉండటం వల్ల, పాల ఉత్పత్తులు ప్రోటీన్‌కు మంచి వనరులు. గ్రీక్ యోగర్ట్: ఇది అధిక నాణ్యత గల ప్రోటీన్‌ను అందిస్తుంది. 100 గ్రాముల గ్రీక్ యోగర్ట్ నుండి సుమారు 8-10 గ్రాముల ప్రోటీన్ లభిస్తుంది. రెండు సార్లు గ్రీక్ యోగర్ట్ తీసుకోవడం వల్ల 20 గ్రాముల ప్రోటీన్ సులభంగా పొందవచ్చు. పనీర్: సాంప్రదాయ పనీర్‌లో కొవ్వు శాతం ఎక్కువ ఉంటుంది. 15-18 గ్రాముల ప్రోటీన్ పొందడానికి 25 గ్రాముల కొవ్వును తీసుకోవలసి రావచ్చు. అయితే, ప్రస్తుతం లభిస్తున్న లో-ఫ్యాట్ పనీర్ అద్భుతమైన ఎంపిక. 100 గ్రాముల లో-ఫ్యాట్ పనీర్‌లో 25 గ్రాముల ప్రోటీన్, కేవలం 9 గ్రాముల కొవ్వు మాత్రమే ఉంటుంది. ఇది చికెన్‌కు సమానమైన ప్రోటీన్‌ను అందిస్తుంది. సోయా ఉత్పత్తులు: సోయా చంక్స్, టోఫు, టెంపే (పులియబెట్టిన సోయా, ఇటీవలే భారతదేశంలో అందుబాటులోకి వచ్చింది) క్లాస్ 1 ప్రోటీన్ వనరులు. ఇవి శాఖాహారులకు సంపూర్ణ ప్రోటీన్‌ను అందిస్తాయి.


పప్పు ధాన్యాలు వాటి వినియోగం

పప్పు దినుసులు (కందులు, పెసలు, శనగలు, రాజ్మా, ఉలవలు) కూడా ప్రోటీన్‌ను అందిస్తాయి. కానీ అవి క్లాస్ 2 ప్రోటీన్ల కిందకు వస్తాయి. ముఖ్యంగా, చాలా మంది ఆరోగ్యకరమైనవిగా భావించే మొలకెత్తిన పెసలు (మూంగ్ స్ప్రౌట్స్) 100 గ్రాములలో కేవలం 3 గ్రాముల ప్రోటీన్‌ను మాత్రమే కలిగి ఉంటాయి. వాటిలో ఫైబర్, మైక్రోన్యూట్రియెంట్లు పుష్కలంగా ఉన్నప్పటికీ, ప్రోటీన్‌కు ఏకైక వనరుగా పరిగణించకూడదు.

సంపూర్ణ ప్రోటీన్ కోసం ఆహార కలయికలు

శాఖాహారులకు సంపూర్ణ అమైనో ఆమ్ల ప్రొఫైల్‌ను పొందడానికి వివిధ ప్రోటీన్ వనరులను కలిపి తీసుకోవడం చాలా అవసరం. మొలకెత్తిన పెసలతో కలయిక: మొలకెత్తిన పెసలతో పాటు కనీసం 50 గ్రాముల లో-ఫ్యాట్ పనీర్ లేదా 30 గ్రాముల సోయా చంక్స్/టోఫు కలిపి సలాడ్ చేసుకుంటే ప్రోటీన్, ఫైబర్ రెండూ లభిస్తాయి. మసూర్ దాల్ (ఎర్ర పప్పు) వినియోగం: ఎర్ర పప్పును రాత్రంతా లేదా కనీసం 3 గంటలు నానబెట్టి, పెసరట్టు లాగా దోశగా వేసుకోవచ్చు. అందులో 50 గ్రాముల పనీర్, టోఫు లేదా గ్రీక్ యోగర్ట్ స్ప్రెడ్‌తో స్టఫ్ చేసుకోవడం ద్వారా ప్రోటీన్ అధికంగా ఉండే పోషకమైన ఆహారం లభిస్తుంది. మొత్తంగా, ప్రోటీన్ మన శరీరానికి అత్యవసరం. వివిధ రకాల ప్రోటీన్ వనరులను గుర్తించడం, వాటి నాణ్యతను అర్థం చేసుకోవడం, ముఖ్యంగా శాఖాహారులు తమ ఆహారంలో తెలివైన కలయికలను ఉపయోగించడం ద్వారా తమ రోజువారీ ప్రోటీన్ అవసరాలను సమర్థవంతంగా తీర్చుకోవచ్చు.. అయితే.. ఏమైనా సమస్యలుంటే నేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.

## బ్రష్ చేసేటప్పుడు మీరు చేసే తప్పులు ఇవే.. వెంటనే ఇలా చేయకపోతే మీ పళ్ల పని అయిపోయినట్లే..



చాలామంది తమ దంతాలు తెల్లగా, మెరుస్తూ కనిపించాలనే తాపత్రయంతో ఉదయాన్నే బ్రష్‌ను పంటిపై పెట్టి గట్టిగా రుద్దేస్తుంటారు. అలా బలంగా తోమితేనే పళ్లు శుభ్రపడతాయని భావించడం ముమ్మాటికీ పొరపాటని ప్రముఖ దంత వైద్యురాలు డాక్టర్ జనని జయపాల్ హెచ్చరిస్తున్నారు. దంతాల పరిశుభ్రతకు కావాల్సింది శారీరక బలం కాదు, సరైన బ్రషింగ్ పద్ధతి అని చెప్పారు. పళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే ఎలా తోముకోవాలనేది ఇప్పుడు తెలుసుకుందాం..

చేతులు మార్చండి: మనకు తెలియకుండానే పళ్లపై ఎక్కువ బలాన్ని ప్రయోగించడాన్ని నివారించడానికి వైద్యులు ఒక ఆసక్తికరమైన చిట్కాను సూచిస్తున్నారు. మీరు కుడి చేతి వాటం వారైతే ఎడమ చేతితో, ఎడమ చేతి వాటం వారైతే కుడి చేతితో బ్రష్ చేయడం అలవాటు చేసుకోండి. దీనివల్ల సహజంగానే పళ్లపై పడే ఒత్తిడి తగ్గుతుంది. అలాగే బ్రష్ హ్యాండిల్‌ను గుప్పిట పట్టి పట్టుకోకుండా.. కేవలం మూడు వేళ్లతో మాత్రమే పట్టుకుని బ్రష్ చేయడం వల్ల చిగుళ్లకు ఎలాంటి గాయాలు కాకుండా దంతాలను సురక్షితంగా శుభ్రం చేసుకోవచ్చు. చేతులు మార్చండి: మనకు తెలియకుండానే పళ్లపై ఎక్కువ బలాన్ని ప్రయోగించడాన్ని నివారించడానికి వైద్యులు ఒక ఆసక్తికరమైన చిట్కాను సూచిస్తున్నారు. మీరు కుడి చేతి వాటం వారైతే ఎడమ చేతితో, ఎడమ చేతి వాటం వారైతే కుడి చేతితో బ్రష్ చేయడం అలవాటు చేసుకోండి. దీనివల్ల సహజంగానే పళ్లపై పడే ఒత్తిడి తగ్గుతుంది. అలాగే బ్రష్ హ్యాండిల్‌ను గుప్పిట పట్టి పట్టుకోకుండా.. కేవలం మూడు వేళ్లతో మాత్రమే పట్టుకుని బ్రష్ చేయడం వల్ల చిగుళ్లకు ఎలాంటి గాయాలు కాకుండా దంతాలను సురక్షితంగా శుభ్రం చేసుకోవచ్చు. బ్రష్ ఎంపిక: మార్కెట్లో దొరికే ఏ బ్రష్ పడితే అది వాడటం దంత ఆరోగ్యానికి మంచిది కాదు. ఎల్లప్పుడూ మెత్తటి బ్రిస్టల్స్ కలిగిన సాఫ్ట్ లేదా ఫ్లెక్సిబుల్ టూత్ బ్రష్‌లను మాత్రమే ఎంచుకోవాలి. ఇవి పళ్ల సందుల్లోకి సులువుగా దూసుకెళ్లి వ్యర్థాలను తొలగిస్తాయి. ఒకవేళ మీరు ఎంత బలం ఉపయోగిస్తున్నారో మీకు అర్థం కాకపోతే, ప్రెజర్ సెన్సార్ ఉండే ఎలక్ట్రిక్ టూత్ బ్రష్ ఉపయోగించడం మంచి ప్రత్యామ్నాయం. ఇది పళ్ళపై ఒత్తిడి ఎక్కువైనప్పుడు హెచ్చరిస్తూ దంతాలను కాపాడుతుంది. బ్రష్ ఎంపిక: మార్కెట్లో దొరికే ఏ బ్రష్ పడితే అది వాడటం దంత ఆరోగ్యానికి మంచిది కాదు. ఎల్లప్పుడూ మెత్తటి బ్రిస్టల్స్ కలిగిన సాఫ్ట్ లేదా ఫ్లెక్సిబుల్ టూత్ బ్రష్‌లను మాత్రమే ఎంచుకోవాలి. ఇవి పళ్ల సందుల్లోకి సులువుగా దూసుకెళ్లి వ్యర్థాలను తొలగిస్తాయి. ఒకవేళ మీరు ఎంత బలం ఉపయోగిస్తున్నారో మీకు అర్థం కాకపోతే, ప్రెజర్ సెన్సార్ ఉండే ఎలక్ట్రిక్ టూత్ బ్రష్ ఉపయోగించడం మంచి ప్రత్యామ్నాయం. ఇది పళ్ళపై ఒత్తిడి ఎక్కువైనప్పుడు హెచ్చరిస్తూ దంతాలను కాపాడుతుంది. దంతాలు సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడం తప్పనిసరి. బ్రష్ చేసేటప్పుడు టూత్ బ్రష్‌ను దంతాలకు 45 డిగ్రీల కోణంలో ఉంచాలి. చిగుళ్ల పైభాగం నుండి కిందికి మెల్లగా వృత్తాకారంలో కదిలిస్తూ తోమాలి. అంతేకాకుండా పళ్ల లోపలి భాగాలను కూడా మర్చిపోకుండా శుభ్రం చేయాలి. ఈ ప్రక్రియ మొత్తాన్ని కనీసం 2 నిమిషాల పాటు ఓపికగా చేయాలే తప్ప, ఏదో చుట్టేసాం అన్నట్లుగా ముగించకూడదు. దంతాలు సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడం తప్పనిసరి. బ్రష్ చేసేటప్పుడు టూత్ బ్రష్‌ను దంతాలకు 45 డిగ్రీల కోణంలో ఉంచాలి. చిగుళ్ల పైభాగం నుండి కిందికి మెల్లగా వృత్తాకారంలో కదిలిస్తూ తోమాలి. అంతేకాకుండా పళ్ల లోపలి భాగాలను కూడా మర్చిపోకుండా శుభ్రం చేయాలి. ఈ ప్రక్రియ మొత్తాన్ని కనీసం 2 నిమిషాల పాటు ఓపికగా చేయాలే తప్ప, ఏదో చుట్టేసాం అన్నట్లుగా ముగించకూడదు. తిన్న వెంటనే చేయొద్దు: ఆహారం లేదా టిఫిన్ తిన్న వెంటనే బ్రష్ చేసే అలవాటు చాలామందికి ఉంటుంది. కానీ ఏదైనా తిన్న తర్వాత లేదా పండ్ల రసాలు వంటి ఆమ్ల గుణాలున్న పదార్థాలు తాగిన తర్వాత నోటిలో యాసిడ్స్ ఉత్పత్తి అవుతాయి. ఆ సమయంలో ఎనామిల్ చాలా బలహీనంగా ఉంటుంది. కాబట్టి తిన్న వెంటనే బ్రష్ చేస్తే ఎనామిల్ అరిగిపోతుంది. అందుకే ఆహారం తిన్న తర్వాత కనీసం 30 నిమిషాల పాటు ఆగి.. ఆపై పుష్కలంగా నీరు తాగి లేదా బ్రష్ చేయడం మంచిదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తిన్న వెంటనే చేయొద్దు: ఆహారం లేదా టిఫిన్ తిన్న వెంటనే బ్రష్ చేసే అలవాటు చాలామందికి ఉంటుంది. కానీ ఏదైనా తిన్న తర్వాత లేదా పండ్ల రసాలు వంటి ఆమ్ల గుణాలున్న పదార్థాలు తాగిన తర్వాత నోటిలో యాసిడ్స్ ఉత్పత్తి అవుతాయి. ఆ సమయంలో ఎనామిల్ చాలా బలహీనంగా ఉంటుంది. కాబట్టి తిన్న వెంటనే బ్రష్ చేస్తే ఎనామిల్ అరిగిపోతుంది. అందుకే ఆహారం తిన్న తర్వాత కనీసం 30 నిమిషాల పాటు ఆగి..

# హైటెక్ హంగులతో 'ముంచాడు'

**రూ.6 వేల కోట్ల స్కామ్**

**దేశవ్యాప్తంగా వేలల్లో బాధితులు**

**కూకట్‌పల్లి, కొండాపూర్‌లో హైటెక్ హంగులతో కార్యాలయాలు**

**దేశవ్యాప్తంగా వేల మందిని ముంచి గుజరాత్‌లో చిక్కిన నిందితుడు**

**షేర్స్ బజార్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అరెస్ట్**

**బాధితుల్లో 1500 మంది తెలుగువారే**



రూ.లక్ష పెట్టుబడి పెట్టండి. సంవత్సరానికి 48 శాతం వడ్డీ చెల్లిస్తాం. కంపెనీలో వాటాలు సైతం ఇస్తామంటూ దేశవ్యాప్తంగా వేల మందిని ముంచిన షేర్స్ బజార్ ప్రైవేట్ లిమిటెడ్, కిసాన్ పరివార్ లిమిటెడ్ సంస్థల వ్యవస్థాపకుడు నేనావత్ భూపాల్ నాయక్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. ఈ 2 కంపెనీల పేరుతో నిందితుడు దేశవ్యాప్తంగా దాదాపు 6 వేల మందిని మోసగించినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. బాధితుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే 1500 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కందికొండకు చెందిన నేనావత్ భూపాల్ నాయక్ షేర్ మార్కెట్ ఎనలిస్ట్‌గా చేసే వాడు. తక్కువ వ్యవధిలో డబ్బు సంపాదించాలని పథకం వేసిన అతను, 2020లో షేర్స్ బజార్ ప్రైవేట్ లిమిటెడ్, కిసాన్ పరివార్ లిమిటెడ్ పేరుతో 2 సంస్థలను ఏర్పాటు చేశారు. కూకట్‌పల్లి, కొండాపూర్‌లో దాదాపు 30 మంది ఉద్యోగులు, హైటెక్ హంగులతో కార్యాలయాలను ఏర్పాటు చేశాడు. ఎస్‌బీపీఎల్ సంస్థ ద్వారా స్టాక్ ట్రేడింగ్ చేస్తామని, సెబీలోనూ రిజిస్టర్ అయ్యిందని ఆన్‌లైన్‌తో పాటు వేర్వేరు మార్గాల్లో ప్రచారం చేసేవాడు.కిసాన్ పరివార్ లిమిటెడ్ సంస్థ రైతుల నుంచి భూములు సమీకరించి, ప్రకృతి వ్యవసాయం చేస్తోందని ప్రచారం చేసేవాడు. ఇదంతా నమ్మి ఎవరైనా ముందుకొస్తే కొన్ని పథకాల గురించి వివరించేవారు. ప్లాన్ ఏ కింద పెట్టుబడికి 18 శాతం లాభం, ప్లాన్ బీ కింద 30 శాతం, ప్లాన్ సీ కింద 48 శాతం చొప్పున వార్షిక లాభం ఉంటుందని ప్రచారం చేశారు. ఒకవేళ 12.5 లక్షల పెట్టుబడి పెడితే 5 గుంటల భూమి రిజిస్ట్రేషన్ చేసి, 24 శాతం చొప్పున లాభం ఇస్తామని నమ్మించారు. ఇది నమ్మిన వందలాది మంది బాధితులు రూ.కోట్లల్లో డబ్బు బదిలీ చేశారు.కొందరు బంగారం, పొలాలు అమ్మి రూ.కోటికి పైగా పెట్టుబడులు పెట్టారు. సంస్థ ప్రతినిధులు కొద్ది నెలలు లాభాలు ఇచ్చినా గతేడాది సెప్టెంబరు నుంచి చెల్లింపులు ఆపేశారు. బాధితులు డబ్బు గురించి అడిగితే కొంత ఆలస్యంగా ఇస్తామని చెప్పారు. ఆ తర్వాత పత్తాలేకుండా పోవడంతో బాధితులు మోసపోయినట్లు గుర్తించారు.మోకిలకు చెందిన విశ్రాంత నేవీ అధికారి సంజీవ్ గుప్తా సహా మరో 10 మంది భూపాల్ నాయక్ మాటలు నమ్మి ఈ రెండు సంస్థల్లో రూ.4.51 కోట్ల పెట్టుబడులు పెట్టారు. బాధితుల ఫిర్యాదుతో సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీస్ స్టేషన్‌లో జూన్ 15న కేసు నమోదు చేశారు. నిందితుడు కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా మోసాలు చేసినట్లు పోలీసులు అనుమానించారు. గుజరాత్‌లో కేసు నమోదు కాగా, భూపాల్ పారిపోయే అవకాశముందని భావించి లుకౌట్ నోటీసులు జారీ చేశారు. నిందితుడు 10 రోజుల కిందట శంషాబాద్ విమానాశ్రయంలో ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయత్నించే సమయంలో గుజరాత్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి తీసుకెళ్లారు.ఈ సమాచారం అందుకున్న సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు పీటీ వారెంట్ మీద భూపాల్‌ను హైదరాబాద్‌కు తీసుకువచ్చి నిందితుడిని రిమాండ్ చేశారు. ఈ మోసంలో భూపాల్‌కు అట్లూరి ప్రసన్న, నేనావత్ రజనీ, నేనావత్ బాబూ నాయక్, నేనావత్ అనూష, దంతు రాంబాబు, శంకర్‌రావు తదితరులు సహకరించినట్లు బాధితులు తెలిపారు.నా భర్త రూ.70 లక్షలు పెట్టుబడి పెట్టాడు. అక్టోబర్‌లో డబ్బులు తీసుకునే సమయానికి డబ్బులు ఇవ్వడం మానేశాడు. జనవరి 31కి ఇస్తానని చెప్పాడు. ఎన్నిసార్లు వెళ్లి అడిగినా ఇవ్వకపోగా, ఎవరికైనా ఫిర్యాదు చేస్తే డబ్బులు ఇవ్వడం ఆపేస్తామన్నాడు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మేనకోడలు తన భార్య అంటూ బెదిరించాడు - మాధవి లతప్రధాన నిందితుడు భూపాల్ నాయక్ 2023 శాసనసభ ఎన్నికల్లో డోర్నకల్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశాడు. నియోజకవర్గం పరిధిలో కిసాన్ పరివార్ పేరుతో కొన్ని ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. మండల స్థాయి ఏజెంట్లకు బైక్‌లు పంపిణీ చేశాడు. గ్రామాల్లో మంచి నీటి కోసం బోర్లు తవ్వడం, విద్యార్థులకు బస్‌పాస్‌లు పంపిణీ చేస్తూ ప్రచార కార్యక్రమాలతో ఊదరగొట్టాడు. అదే వ్యక్తి దేశవ్యాప్తంగా వేలాది మందిని ముంచి రూ.కోట్లలో మోసానికి పాల్పడి అరెస్టవ్వడంతో డోర్నకల్ నియోజకవర్గ ప్రజలు విస్తుపోతున్నారు.2022లో నా స్నేహితుడి ద్వారా భార్య, బంధువుల పేరు మీద మొత్తం రూ.2 కోట్లు పెట్టుబడి పెట్టాను. అక్టోబర్ నెల నుంచి పేమెంట్స్ ఆపారు. మూడు నెలల వరకు వేచి చూశాం. ఇందులో 20 షెల్ కంపెనీలు, 30 నుంచి 40 వేర్వేరు అకౌంట్‌లు ఉన్నాయని తెలిసింది. ఇందులోని ఒక డైరెక్టర్ ప్రసన్న అమెరికాకు వెళ్లిపోయింది. నాయక్ భార్య రజని, అకౌంట్ సిస్టమ్‌లో ఉండే శంకర్‌ను పట్టుకోవాలి. అప్పుడే న్యాయం జరుగుతుంది. ఇది మొత్తం రూ.6 వేల కోట్ల స్కామ్ అని చెబుతున్నారు. - సుభాష్ రెడ్డి, బాధితుడు

# ధరణిలో దొంగలు - 10 వేల ఎకరాలు స్వాహా!

**ధరణి పోర్టల్‌పై విచారణలో సంచలన విషయాలు**

**10 వేల ఎకరాలపై దొడ్డిదారిన హక్కుల మార్పిడి**

**భూదోపిడీకి సీసీఎల్‌ఏలోని ఇద్దరి సహకారం**

**పోలీసుల అదుపులో పలువురు అక్రమార్కులు**



ధరణి పోర్టల్‌లో జరిగిన అక్రమాలపై సంచనల విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సాంకేతిక లోపాలను అడ్డుపెట్టుకుని 10 వేల ఎకరాల భూములకు సంబంధించిన హక్కులను దొడ్డిదారిన మార్చేసినట్లు విచారణలో గుర్తించారు. ఈ అక్రమాలకు సీసీఎల్‌ఏలోని ఇద్దరు సహా జిల్లాల్లో కొందరు సహకరించినట్లు తేల్చారు. పోలీసులు పలువురు అక్రమార్కులను అదుపులోకి తీసుకునట్లు తెలుస్తోంది.సాగు భూముల రిజిస్ట్రేషన్లు-మ్యుటేషన్ల పోర్టల్ ధరణిలో 10 వేల ఎకరాల అక్రమాలు చోటు చేసుకుంది. పోర్టల్‌లోని లొసుగుల ఆధారంగా విలువైన భూములున్న ప్రాంతాల్లో వేల ఎకరాలకు సంబంధించిన హక్కులను దొడ్డిదారిన మార్చేశారు. ప్రధానంగా ఎకరా కోట్ల ధర పలికే రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతోపాటు సిద్దిపేట, రాజన్న-సిరిసిల్ల, జయశంకర్-భూపాలపల్లి జిల్లాల్లో భూఅక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈ భూదోపిడీకి సీసీఎల్‌ఏకు సంబంధించిన ఇద్దరు సహకారం అందించినట్లు తెలుస్తోంది. వివిధ జిల్లాల్లోని సిబ్బంది సైతం వారి బాటలో నడిచినట్లు తెలిసింది. దీనిపై విచారణ చేస్తున్న పోలీసులు ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.ధరణిలో సాధారణంగా జరిగే ప్రక్రియ లేకుండా, దస్త్రాలను వాడకుండా భూములపై యాజమాన్య హక్కులు మారినట్లు పలు జిల్లాల్లో కలెక్టర్ల దృష్టికి వచ్చింది. దీనిపై సాంకేతిక, రెవెన్యూ చట్టాల నిపుణులతో అధ్యయనం చేయించి, ప్రాథమిక సమాచారం సేకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సైబర్ క్రైం, ఐటీ విభాగాల వారితోనూ పరిశీలింపజేసింది. ఈ క్రమంలో పెద్దఎత్తున భూముల హక్కులు దారి మళ్లినట్లు గుర్తించింది. మరింత లోతుగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలంటూ రెండు రోజుల క్రితం ఐఏఎస్ అధికారులు, సైబర్ క్రైం, ఐటీ, ఎన్ఐసీ తదితర విభాగాల ప్రతినిధులతో ఉన్నతస్థాయి బృందాన్ని ఏర్పాటు చేసింది. వారు దస్త్రాలను పరిశీలించగా ఎసైన్డ్, ప్రభుత్వ, మిగులు, భూదాన్ భూములతోపాటు వివాదాల్లో ఉన్న పట్టా భూముల్లోనూ వేల కొలది ఎకరాల దోపిడీ జరిగినట్లు తేల్చారు.మేడ్చల్ జిల్లా రావెల్‌కోల్‌లోని నాలుగు సార్వేల్లలో ఎకరాల కొద్దీ భూములు వేరే వారి పేర్లపైకి మారినట్లు గుర్తించారు. ఒకచోట 16 ఎకరాలు, మరోచోట 15.28 ఎకరాలు ఇతరుల పేర్లపైకి మారినట్లు తేల్చారు. రంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాల్లో, సిద్దిపేట జిల్లా కుక్కునూరుపల్లి మండలంలో విలువైన భూములు, జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో కొన్ని పట్టా భూములు ఇతరుల పేర్లపైకి మారాయి. వికారాబాద్, మహబూబ్‌నగర్, ఉమ్మడి నల్గొండ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఈ అక్రమం ఆనుపానులు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అయితే ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడా మార్పు చేర్పులు జరగలేదు.ధరణి పోర్టల్ సాంకేతికతలోని లొసుగులను గుర్తించిన పలువురు వ్యక్తులు అక్రమానికి తెరలేపినట్లు తెలిసింది. మీ-సేవా, తహసీల్దారు-సంయుక్త సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు దస్త్రాలు ఏవీ రాకున్నా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో వివిధ కార్యాలయాల్లోని సిబ్బంది సాయం తీసుకుని హక్కులను మార్చేసినట్లు అంచనాకు వచ్చారు. ఈ తతంగంలో హైదరాబాద్‌లోని భూ పరిపాలన ప్రధాన కమిషనర్- సీసీఎల్ఏ కార్యాలయానికి చెందిన ఇద్దరి హస్తం ఉన్నట్లు విచారణ బృందం తేల్చింది. కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ కీలక వ్యక్తి, నిజామాబాద్ జిల్లాకు చెందిన కంప్యూటర్ పరిజ్ఞానమున్న మరో వ్యక్తి సహకారంతోనూ కొన్ని భూములపై హక్కుల మార్పిడి జరిగినట్లు తెలిసింది. ధరణి పోర్టల్ భూభారతిగా మారిన తర్వాత పాత సాఫ్ట్‌వేర్ కొనసాగుతున్న సమయంలోనూ కొన్ని జిల్లాల్లో హక్కులను మార్చినట్లు అనుమానిస్తున్నారు.విచారణ బృందం గుర్తించిన అనుమానితుల్లో కొందరు రెవెన్యూ అధికారులు, సిబ్బంది, మాజీ ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. పలు ఆన్‌లైన్ సెంటర్ల నిర్వాహకులు, గ్రామస్థాయి సిబ్బంది, దళారులు సైతం ఈ ముఠాలో ఉన్నట్లు తెలిసింది. వారిలో కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఆన్‌లైన్‌లో ఎలాంటి దరఖాస్తులు, వినతులు లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా జరిగిన లావాదేవీలను గుర్తించారు. ఇందుకు బాధ్యులైన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, ధరణి ఆపరేటర్లకు పలు జిల్లాల కలెక్టర్లు నోటీసులు అందజేసినట్లు తెలిసింది.

# ఈ పెళ్లి ఎలాగూ జరగదంటూ నెల ముందే ఫ్రెండ్‌కు సియా మెసేజ్

**కేతన్ అగర్వాల్ హత్య కేసులో మరో ట్విస్ట్**

**పుణె రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య కేసులో కీలక పరిణామం**

**పెళ్లి జరగదని స్నేహితురాలికి ముందే మెసేజ్ చేసిన సియా గోయల్**

**మరోవైపు గుండెపోటుతో మరణించిన కేతన్ అగర్వాల్ తాత**



మహారాష్ట్ర పుణెకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కేతన్ అగర్వాల్ హత్య కేసు దర్యాప్తులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా నిందితురాలు సియా గోయల్ హత్యకు దాదాపు నెల రోజుల ముందే తన స్నేహితురాలికి 'ఈ పెళ్లి జరగదు' అంటూ స్నాప్‌చాట్‌లో మెసేజ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మెసేజ్-హత్యకు చాలా కాలం ముందే కుట్ర పన్నినట్లు అనుమానాల్ని బలపరుస్తోందని అధికారులు భావిస్తున్నారు. ఇదే సమయంలో కేతన్ తాత దేవీచంద్ అగర్వాల్ గుండెపోటుతో మృతి చెందడం కుటుంబంలో మరో విషాదాన్ని మిగిల్చింది.పోలీసుల సమాచారం ప్రకారం మే నెలలో సియా గోయల్ తన స్నేహితురాలికి స్నాప్‌చాట్‌లో ఒక సందేశం పంపింది. నవంబరులో ఉదయ్‌పూర్‌లో జరగాల్సిన వివాహానికి అతిథుల టికెట్లు బుక్ చేయడానికి ఆధార్ కార్డ్ కాపీ పంపాలని కోరుతూ ఒక మెసేజ్ చేసింది. 'పెళ్లికి టికెట్లు బుక్ చేయడం కోసం నీ ఆధార్ కార్డు ముందు, వెనుక ఫొటోలు పంపు. ఈ పెళ్లి ఎలాగూ జరగదు. అయినా పంపు.' అని సియా మెసేజ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అప్పటికే కేతన్ కుటుంబం- బంధువులు, స్నేహితుల ప్రయాణ ఏర్పాట్ల కోసం అతిథుల పేర్లు, ఆధార్ వివరాలు సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సియా తరఫున బంధువుల వివరాలు కూడా అడిగినట్లు చెప్పారు.ఇక ఈ స్నాప్‌చాట్ సందేశం నిజమైనదేనా అనే విషయాన్ని పోలీసులు సాంకేతికంగా పరిశీలిస్తున్నారు. అలాగే సియా స్నేహితురాల్ని విచారించి- కేతన్ హత్య గురించి ముందే తెలుసా, సియా పెళ్లి జరగదని ఎందుకు చెప్పింది, తన ప్లాన్ విషయాన్ని సియా ఎప్పుడైనా చెప్పిందా అనే అంశాలపై సమాచారం సేకరించనున్నట్లు తెలుస్తోంది.కేతన్ అగర్వాల్ హత్య కేసులో 20 ఏళ్ల సియా గోయల్, 22 ఏళ్ల చేతన్ చౌదరిని పోలీసులు గత నెలలో అరెస్ట్ చేశారు. దర్యాప్తు ప్రకారం జూన్ 18న పుణె సమీపంలోని లోహ్‌గడ్ కోటకు కేతన్ అగర్వాల్‌ను తీసుకెళ్లారు. అక్కడ లోయలోకి తోసి హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ప్రమాద వశాత్తు కిందపడిపోయినట్లు చిత్రీకరించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం సియాకు ఈ పెళ్లి చేసుకోవడం ఇష్టం లేకపోయినా కుటుంబ సభ్యుల ఒత్తిడి వల్లే వివాహానికి అంగీకరించినట్లు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే హత్యకు ప్లాన్ చేసినట్లు భావిస్తున్నారు. కేసు పురోగతిలో భాగంగా సియా గోయల్, చేతన్ చౌదరి ఫోన్ సంభాషణలు, చాట్స్ సహా ఇతర కీలక డేటాను సేకరిస్తున్నారు. ప్రస్తుతం వీరిద్దరూ పోలీసుల కస్టడీలోనే ఉన్నారు.దర్యాప్తులో భాగంగా పోలీసులు కీలక ఆధారాలు సేకరిస్తున్నారు. గురువారం రోజు పుణెలోని ఉల్లానగర్ ప్రాంతానికి సియా గోయల్‌ను తీసుకెళ్లి, అక్కడ హత్య ప్రణాళికకు సంబంధించిన రిహార్సల్ జరిగినట్లు భావిస్తున్న ప్రదేశాన్ని పోలీసులు ఇప్పటికే పరిశీలించారు. హత్య జరిగిన రోజు సియా గోయల్ వేసుకున్న దుస్తుల్ని వారి ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు బుధవారం రోజు చేతన్ చౌదరిని లోహ్‌గడ్ కోటకు తీసుకెళ్లి కేతన్ బరువుతో సమానమైన డమ్మీ సహాయంతో ఘటనను రీక్రియేట్ చేశారు. నేరం ఎలా జరిగిందో అధికారులు పరిశీలించారు. సియా తండ్రి ప్రవీణ్ గోయల్ మాట్లాడుతూ పోలీసులు తమ ఇంటికి వచ్చినప్పటికీ తనను ఎలాంటి ప్రశ్నలు అడగలేదన్నారు. 'పోలీసులు సుమారు 30 నుంచి 45 నిమిషాల పాటు ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. పోలీసులు నన్ను ఏం ప్రశ్నించలేదు.' అని తెలిపారు.మరోవైపు ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగానే కేతన్ అగర్వాల్ తాత దేవీచంద్ అగర్వాల్ (71) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యుల ప్రకారం కేతన్ మరణం తర్వాత ఆయన తీవ్ర మనోవేదనకు గురయ్యారు. కొద్ది రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గుండెపోటుతో కన్నుమూశారు. దీంతో ఇప్పటికే కేతన్ చనిపోయిన బాధలో ఉంటే మరో విషాదం నెలకొంది.

# తెలంగాణలో ఘోర రోడ్డు ప్రమాదం

**నలుగురు ఏపీ వాసులు మృతి**

**నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం**

**కారును ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు, కారులోని నలుగురు మృతి**

**మృతులు కాకినాడ జిల్లా వాసులుగా గుర్తింపు**




తెలంగాణలోని నల్గొండ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ఏపీ వాసులు మృతిచెందారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద జాతీయరహదారిపై హైదరాబాద్ వెళ్తున్న కారును ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్ననలుగురు మృతి చెందారు. దీనిపై సమాచారం అందుకున్న చిట్యాల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.తీవ్రంగా గాయపడిన ఎస్‌బీఐ ఉద్యోగి ప్రసాద్‌ను నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులు తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన ఎస్‌బీఐ ఉద్యోగి ప్రసాద్ భార్య, కుమార్తె(15), కుమారుడు(10), ప్రసాద్ స్నేహితుడు శ్రీకర ప్రసాద్(62)గా గుర్తించారు. ఈ ఘటనపై చిట్యాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏలూరు జిల్లాలో విషాదం

**రైలు ఢీకొని నలుగురి మృతి**

**చేబ్రోలు స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని నలుగురు మృతి**

**మృతుల్లో ముగ్గురు మహిళలు, యువకుడు ఆత్మహత్య లేదా ప్రమాదమా అనే కోణంలో పోలీసుల దర్యాప్తు**



ఏలూరు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఉంగుటూరు మండలంలో చేబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి రైలు ఢీకొని నలుగురు మృతి చెందారు. మృతుల్లో ఒక పురుషుడు, ముగ్గురు మహిళలు ఉన్నారు. చర్లపల్లి నుంచి షాలిమార్ వెళ్తున్న ప్రత్యేక రైలు వీరిని ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు మృతదేహాలు ఛిద్రమవడంతో గుర్తు పట్టలేని విధంగా ఉన్నాయి. సమాచారం అందుకున్న తాడేపల్లిగూడెం జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు.వీరు ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని, ఒకే కుటుంబానికి చెందిన వారై ఉంటారని రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుల వయసు 30 నుంచి 35 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. ఓ మహిళా మృతదేహం వద్ద లభించిన ఏటీఎం కార్డుపై షేక్ హసీనా అని ఉంది. మరో మహిళ వద్ద తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపోలో బైక్ పార్క్ చేసిన రసీదు గుర్తించారు. ఘటనా స్థలిలో రెండు ఫోన్లు లభించినప్పటికీ అవి ధ్వంసమయ్యాయి. వాటి సిమ్‌కార్డులు వేరే సెల్‌ఫోన్‌లో వేసి మృతులు ఎవరనేది ఆరా తీస్తున్నారు. మృతదేహాలను తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించామని జీఆర్పీ ఎస్ఐ అప్పారావు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# సముద్రంలో మత్స్యకారుల గల్లంతు

**ఒకరు క్షేమం, మరో ఆరుగురి కోసం గాలింపు**

**సముద్రంలో గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల్లో ఒకరు క్షేమం**

**బోటు యజమాని కారె చిన్నను కాపాడి ఒడ్డుకు తరలించిన సహాయబృందాలు**

**మత్స్యకారుల గల్లంతుపై ఉన్నతాధికారులతో మాట్లాడిన సీఎం చంద్రబాబు**

విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారుల్లో ఆరుగురు సముద్రంలో గల్లంతయ్యారు. ఈనెల 1న ఫిషింగ్ హార్బర్ నుంచి విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముక్కాంకు చెందిన అప్పలరాజు, కె.చిన్నయ్య, చిన్న, గరగయ్య, సీతోడు, విశాఖ జిల్లా భీమిలి మండలం పెదనాగమయ్యపాలేనికి చెందిన బండియ్య, విశాఖకు చెందిన చిన్నఅమ్మోరుగా బోటులో చేపల వేటకు వెళ్లారు.అయితే శనివారం సాయంత్రానికి వేటకువెళ్లిన ఏడుగురు ఒడ్డుకు చేరుకోవాల్సి ఉంది. అయితే శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో మత్స్యకారులు చివరిసారిగా కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆ తర్వాత నుంచి వారి ఫోన్లు పని చేయలేదు. అనుకున్న సమయానికి బోటు ఒడ్డుకు చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే వారు కోస్ట్, మెరైన్ పోలీసులకు సమాచారమిచ్చారు. తమ వారి సమాచారం కోసం వారంతా ఫిషింగ్ హార్బర్ వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరవుతున్నారు.సుమారుగా 50 మైళ్ల దూరం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లారు. పూడిమడక పరిసర ప్రాంతాల్లో వేట కొనసాగించారు. చివరిసారిగా గంగవరం పోర్టు సమీపం నుంచి ఇంట్లో వారితో మాట్లాడారు. అలలు ఉద్ధృతికి బోటు ఏదైనా ఒడ్డుకి కొట్టుకుని పోయిందా అని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గల్లంతైన జాలర్ల కోసం ముమ్మరంగా సాగుతున్న గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కోస్ట్ గార్డ్, నావీ అధికారులు రంగంలోకి దిగారు. గజ ఈతగాళ్ల బృందం సముద్రంలోకి వెళ్లింది. మత్స్యకారులు వేట కొనసాగించిన ప్రాంతంలో గాలింపు చేస్తున్నారు. నేవీ హెలికాప్టర్‌తోనూ గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో వేటకు వెళ్లిన ఏడుగురులో ఒకరు క్షేమంగా దొరికారు. బోటు యజమాని చిన్నను క్షేమంగా ఒడ్డుకు తీసుకువస్తున్నారు. మరో ఆరుగురి కోసం గాలింపు కొనసాగుతోంది.మత్స్యకారుల గల్లంతుపై ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. జాలర్లను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. కోస్టుగార్డు నౌకలతో గాలింపు ముమ్మరం చేయాలని ఆదేశించారు. నేవీ హెలికాప్టర్ల ద్వారా రెస్క్యూ ఆపరేషన్ విస్తృతం చేశామని అధికారులు, చంద్రబాబుకు తెలియజేశారు. గాలింపు చర్యలను సమన్వయం చేసుకోవాలని మెరైన్ ఐజీపీ, విశాఖ సీపీలకు సీఎం ఆదేశాలిచ్చారు. అలాగే గాలింపు చర్యలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు.మత్స్యకారుల గల్లంతుపై మంత్రులు ఆరా తీశారు. ఈ మేరకు కలెక్టర్, ఎస్పీ, అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గల్లంతైన వారి కోసం యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. తీర ప్రాంతానికి దగ్గరలోనే ఉండడంతో జాలర్లకు ఎలాంటి ఇబ్బంది ఉండదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మత్స్యకారులను క్షేమంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని చెప్పారు.మత్స్యకారుల గల్లంతుపై హోంమంత్రి అనిత ఆరా తీశారు. ఈ మేరకు కలెక్టర్, ఎస్పీ, మత్స్య శాఖ అధికారులతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. కోస్టుగార్డ్ నౌకలతో గాలింపు ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశించారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అనిత భరోసా ఇచ్చారు.

# జీతాల కంటే వేగంగా పెరుగుతున్న ఖర్చులు

**పార్ట్ టైం చేయకపోతే పూటగడవట్లేదని భోరుమంటున్న ఉద్యోగులు**

**దేశంలో క్రమంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఇప్పుడు సాధారణ ప్రజల దైనందిన జీవితాన్నే కాకుండా**

వారి వృత్తి, ఉద్యోగ నిర్ణయాలను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, రవాణా ఖర్చులతో సహా రోజువారీ జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోవడంతో, తమ ప్రస్తుత జీతాలు మునుపటిలా ఆర్థిక భరోసా ఇవ్వడం లేదని అత్యధిక శాతం మంది ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిరుత్సాహకర పరిస్థితుల వల్ల అదనపు ఆదాయ మార్గాలను వెతుక్కోవడం, ఎక్కువ ప్యాకేజీలు ఇచ్చే కంపెనీలకు మారడం, అలాగే ఖరీదైన మహానగరాలను వదిలి చిన్న నగరాలకు తరలివెళ్లడం వంటి కీలక మార్పులకు ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. ప్రముఖ ఉద్యోగ నియామక వేదిక 'ఇండీడ్' నిర్వహించిన తాజా సర్వేలో ఈ సంచలన విషయాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా 1,200 మందికి పైగా ఉద్యోగులు, 1,000 కి పైగా కంపెనీల యాజమాన్యాల నుండి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. ఈ సర్వే నివేదిక ప్రకారం.. ప్రస్తుత కార్పొరేట్ రంగంలో అత్యధిక శాతం మంది ఉద్యోగులు తక్కువ జీతాలతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దాదాపు 68 శాతం మంది ఉద్యోగులు తమ ప్రస్తుత ఆదాయంతో నెలవారీ జీవన వ్యయాలను సౌకర్యవంతంగా తీర్చలేకపోతున్నామని స్పష్టం చేశారు. దీనిని బట్టి జీతాల పెరుగుదల వేగానికి, మార్కెట్లో వస్తువుల ధరల పెరుగుదల వేగానికి మధ్య ఉన్న అంతరం అంతకంతకూ విస్తరిస్తోందని స్పష్టమవుతోంది. కేవలం 13 శాతం మంది ఉద్యోగులు మాత్రమే తమ ఆదాయం ప్రస్తుత సౌకర్యవంతమైన జీవితానికి సరిపోతుందని చెప్పగా, మిగిలిన వారిలో 32 శాతం మంది ఏదో ఒక రకంగా నెట్టుకొస్తున్నారు. మరో 24 శాతం మంది తమ ఆర్థిక పరిస్థితిని నిర్వహించడం కష్టంగా మారుతోందని అంగీకరించగా, 12 శాతం మంది ఉద్యోగులు తాము తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 72 లక్షల ప్యాకేజీకి 'నో' చెప్పిన టెక్కీ.. వైరల్ అవుతున్న అసలు కారణాలు ఇవే! ఈ ఆర్థిక ఇబ్బందులు ప్రజల మానసిక ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.



సర్వేలో పాల్గొన్న వారిలో 41 శాతం మంది ఉద్యోగులు రెండు సంవత్సరాల క్రితం కంటే ఇప్పుడు తాము ఎక్కువ ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు అంగీకరించారు. ఆహారం, గృహ వసతి, వైద్యం మరియు విద్య వంటి ప్రాథమిక అవసరాల ఖర్చులు మధ్యతరగతి కుటుంబాల పొదుపును పూర్తిగా హరించివేస్తున్నాయని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఈ కారణంగా కేవలం ఒకే ఉద్యోగంపై వచ్చే జీతంపై ఆధారపడి తమ భవిష్యత్తు ఆర్థిక లక్ష్యాలను చేరుకోవడం అసాధ్యంగా మారుతుండటంతో, 'అదనపు ఆదాయం' అనేది ఒక లగ్జరీగా కాకుండా నేటి కాలపు ముఖ్య అవసరంగా మారింది. సర్వే ప్రకారం ఇప్పటికే 14 శాతం మంది ఫ్రీలాన్సింగ్ లేదా ఇతర సైడ్ బిజినెస్‌ల ద్వారా క్రమం తప్పకుండా అదనపు ఆదాయాన్ని సంపాదిస్తుండగా, మరో 19 శాతం మంది అప్పుడప్పుడు పార్ట్ టైమ్ పనులు చేస్తున్నారు. దీనికి తోడు 24 శాతం మంది ఉద్యోగులు భవిష్యత్తులో అదనపు ఆదాయ మార్గాన్ని ప్రారంభించాలని యోచిస్తున్నారు. అంటే, మొత్తంగా 60 శాతం మంది ఉద్యోగులు కేవలం వార్షిక జీతాల పెంపు (అప్రైజల్స్) కోసం ఎదురుచూడకుండా సొంతంగా ప్రత్యామ్నాయ మార్గాలను సృష్టించుకుంటున్నారు. ఈ జీవన వ్యయాల భారం మెట్రో నగరాల పట్ల ఉద్యోగుల్లో ఉన్న మోజును క్రమంగా తగ్గిస్తోంది. సర్వేలో 39 శాతం మంది గృహసముదాయాల అద్దెలను తమ అతిపెద్ద సవాలుగా పేర్కొనగా, 27 శాతం మంది ట్రాఫిక్ సమస్యలు మరియు సుదీర్ఘ ప్రయాణాల వల్ల విసిగిపోతున్నట్లు చెప్పారు. ఈ ఇబ్బందుల కారణంగా మెట్రో నగరాల్లో నివసిస్తున్న 54 శాతం మంది ఉద్యోగులు, తమకు గనుక సమానమైన కెరీర్ అవకాశాలు లభిస్తే టైర్-2, టైర్-3 నగరాలకు (చిన్న నగరాలు) మారిపోవడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ సరికొత్త ధోరణి ముఖ్యంగా హైదరాబాద్‌లోని ఉద్యోగులలో అత్యంత స్పష్టంగా కనిపించగా, ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు నగరాల వారు సైతం ఈ మార్పునకు మొగ్గు చూపుతున్నారు. ఉద్యోగుల ఆలోచనలకు తగ్గట్టుగానే 43 శాతం మంది యజమానులు కూడా తమ నియామక వ్యూహాలను మార్చుకుంటూ, ప్రతిభను ఆకర్షించడానికి టైర్-2, టైర్-3 నగరాలు ఇప్పుడు తమకు అత్యంత ముఖ్యమైనవిగా మారుతున్నాయని అంగీకరించారు. ఈ మారుతున్న కాలంలో ఉద్యోగాన్ని ఎంచుకునేటప్పుడు కేవలం అధిక జీతాలే కాకుండా, ఉద్యోగ భద్రతకు అభ్యర్థులు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. సర్వేలో 41 శాతం మంది ఉద్యోగ స్థిరత్వం మరియు భద్రతను ముఖ్యమైన అంశంగా పేర్కొనగా, 30 శాతం మంది మాత్రమే అధిక జీతాలు మరియు మెరుగైన ప్యాకేజీలను కోరుకున్నారు. తక్కువ ఖర్చుతో కూడిన నగరాలు మరియు మెరుగైన 'వర్క్-లైఫ్ బ్యాలెన్స్' (పని-జీవిత సమతుల్యత) కూడా నేటి తరం ఉద్యోగులకు ప్రాధాన్యత అంశాలుగా మారాయి. అయితే ఈ సర్వే ఒక విచిత్రమైన కార్పొరేట్ వైరుధ్యాన్ని కూడా బయటపెట్టింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం వల్ల తమ సిబ్బంది తీవ్రంగా నష్టపోతున్నారని 73 శాతం కంపెనీలు అంగీకరించాయి. అలాగే ఉద్యోగుల జీతాల అంచనాలు పెరుగుతున్నాయని 56 శాతం యజమానులు స్పష్టం చేశారు. అయినప్పటికీ, తమ ఉద్యోగులపై పడుతున్న ఈ ఆర్థిక భారాన్ని తగ్గించడానికి లేదా సహాయపడటానికి దాదాపు 77 శాతం కంపెనీలు ఎలాంటి కొత్త రాయితీలను, అలవెన్సులను లేదా ప్రత్యేక ఆర్థిక ప్రయోజనాలను ప్రకటించకపోవడం గమనార్హం. దేశంలో మారుతున్న ఈ ఉద్యోగ వాతావరణం భవిష్యత్తులో కంపెనీల నియామకాలను, నగరాల విస్తరణను పూర్తిగా మార్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఇరాన్ యుద్ధంపై ట్రంప్ కీలక ప్రకటన

గంటల వ్యవధిలోనే భారీ వైమానిక, క్షిపణిలతో టెహ్రాన్ మీద యుఎస్ మిలిటరీ దాడులు పశ్చిమ ఆసియాలో శాంతి ఆశలు కల్పిస్తూ కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ఒక్కసారిగా ముక్కలైంది. వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిలో అమెరికాకు చెందిన అధునాతన 'అపాచీ' దాడి హెలికాప్టర్‌ను టెహ్రాన్ (ఇరాన్) కూల్చివేసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధృవీకరించిన కొద్ది గంటల్లోనే.. అమెరికా సైన్యం ఇరాన్‌పై భారీ వైమానిక, క్షిపణి దాడులను ప్రారంభించింది. ఈ ఆకస్మిక దాడి ప్రాంతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీయడమే కాకుండా, పశ్చిమ ఆసియాలో శాంతి ప్రయత్నాలకు గట్టి ప్రతిఘటన ఇచ్చింది. ఈ ప్రతికార చర్యలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏబీసీ న్యూస్‌తో మాట్లాడుతూ.. ఇరాన్ చర్యకు మా ప్రతిస్పందన చాలా బలంగా, అత్యంత శక్తివంతంగా ఉండాలని నేను గట్టిగా నమ్మాను, ఈ దాడులు కూడా సరిగ్గా అలాంటివేనని వ్యాఖ్యానించారు. అమెరికా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇరాన్‌కు చెందిన ఒక వన్-వే అటాక్ (ఆత్మాహుతి) డ్రోన్ దాడి వల్లే అమెరికా అపాచీ హెలికాప్టర్ కూలిపోయింది. అయితే, హెలికాప్టర్ ప్రమాదంలో చిక్కుకున్న ఇద్దరు అమెరికా పైలట్లను అమెరికా నావికాదళానికి చెందిన ఒక ఉపరితల డ్రోన్ సముద్రం నుండి సురక్షితంగా రక్షించిందని, వారి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని సైనిక వర్గాలు తెలిపాయి. వాల్ స్ట్రీట్ జర్నల్‌తో మాట్లాడిన ట్రంప్.. పైలట్లు క్షేమంగా ఉన్నందున హెలికాప్టర్ ఘటన 'పెద్ద విషయం కాదని' ఒకవైపు చెబుతూనే, మరోవైపు ఇరాన్ రక్షణ వ్యవస్థలపై విరుచుకుపడటం గమనార్హం. ఈ దాడుల తీవ్రతను ఇరాన్ ప్రభుత్వ మీడియా సైతం ధృవీకరించింది. హోర్ముజ్ జలసంధిలోని అత్యంత కీలకమైన ఖేష్మ్ ద్వీపంతో పాటు, సిరిక్ ఓడరేవు నగరంపై అమెరికా క్షిపణులతో విరుచుకుపడిందని ఇరాన్ పేర్కొంది. మిలిటరీకి ఎదురుదెబ్బ.. హోర్ముజ్ జలసంధి సమీపంలో కుప్పకూలిన అపాచీ హెలికాప్టర్.. అసలేం జరిగింది.. అలాగే సమీపంలోని బందర్ అబ్బాస్, జలసంధి ప్రవేశ ద్వారమైన జాస్క్ కౌంటీ పరిసరాల్లో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయని



స్థానిక నివాసితులు తెలిపారు. హోర్ముజ్ జలసంధి చుట్టూ అమర్చిన అనేక ఇరాన్ వాయు రక్షణ వ్యవస్థలు రాడార్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. అమెరికా సైనిక కేంద్ర కమాండ్ ఈ మిషన్‌ను "ఇరాన్ యొక్క అన్యాయమైన దురాక్రమణకు అనుపాత ప్రతిస్పందన" గా అభివర్ణించింది. అమెరికా దాడుల అనంతరం ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఎక్స్ వేదికగా స్పందిస్తూ, తమ దేశంపై జరిగిన ఏ దాడిని లేదా బెదిరింపును అయినా జవాబు లేకుండా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఆ ప్రాంతంలోని విదేశీ బలగాలు (అమెరికా సైన్యం) ప్రమాదాలు లేదా ఎదురుకాల్పుల్లో చిక్కుకునే అవకాశం ఉందని, అలాంటి ముప్పులను తగ్గించుకోవాలంటే వాళ్ళు వెంటనే ఇక్కడి నుండి వెళ్లిపోవడమే ఉత్తమ పరిష్కారమని ఆయన స్పష్టం చేశారు. అయితే, గత 24 గంటల్లో ఎలాంటి దాడులు జరగలేదని ఇరాన్ సైనిక మూలాలు కొన్ని నివేదించినప్పటికీ, శత్రువు మళ్లీ తమను రెచ్చగొడితే నిర్ణయాత్మక ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించాయి. మరోవైపు, పశ్చిమ ఆసియాలో యుద్ధాన్ని ముగించడానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలకు ఇజ్రాయెల్ చర్యలు కూడా అడ్డుకట్ట వేస్తున్నాయి. ఇరాన్ మద్దతు ఉన్న హిజ్బుల్లాపై పోరాటాన్ని ఆపడానికి ఇజ్రాయెల్ నిరాకరిస్తోంది. అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందంతో సంబంధం లేకుండా, ఇజ్రాయెల్ దళాలు దక్షిణ లెబనాన్‌లోని చారిత్రాత్మక ఓడరేవు పట్టణమైన టైర్‌పై జరిపిన ఘోరమైన వైమానిక దాడిలో కనీసం ఎనిమిది మంది మరణించారు. మార్చిలో హిజ్బుల్లా ఇజ్రాయెల్‌పై రాకెట్లను ప్రయోగించినప్పటి నుండి లెబనాన్‌పై జరిగిన అత్యంత భీకరమైన దాడి ఇదే కావడం గమనార్హం. ఇటు ఉత్తర ఇజ్రాయెల్‌లో లెబనాన్ సరిహద్దు సమీపంలోని రామిమ్ రిడ్జ్ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒకరు మరణించారు. వాషింగ్టన్‌తో కుదిరే ఏ శాంతి ఒప్పందమైనా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడుల ముగింపుతో ముడిపడి ఉంటుందని ఇరాన్ స్పష్టం చేస్తోంది. ఈ తాజా సైనిక ఘర్షణల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధి గుండా వాణిజ్యం పునఃప్రారంభం కావడం మరింత ఆలస్యం కానుంది. యుద్ధానికి ముందు ప్రపంచంలోని ముడి చమురు మరియు ద్రవీకృత సహజ వాయువులో ఐదో వంతు ఈ మార్గం గుండానే రవాణా అయ్యేది. ప్రస్తుతం ఇరాన్ ఈ జలసంధిని దిగ్బంధించగా, అమెరికా కూడా ఇరాన్ ఓడరేవులపై ఆంక్షలు విధించింది. అయితే, హోర్ముజ్ గుండా నౌకా రవాణా క్రమంగా పెరుగుతోందని, కానీ ఇంధన సరఫరా సాధారణ స్థితికి రావడానికి చాలా నెలలు పడుతుందని అమెరికా ఇంధన శాఖ కార్యదర్శి క్రిస్ రైట్ తెలిపారు. భవిష్యత్తులో ఇరాన్‌తో కుదిరే ఏ శాంతి ఒప్పందమైనా ఆ దేశం అణ్వాయుధాన్ని అభివృద్ధి చేయకుండా అడ్డుకునేలా ఉండాలని ట్రంప్ డిమాండ్ చేస్తుండగా, తమపై అంతర్జాతీయ ఆంక్షలను ఎత్తివేయాలని, స్తంభింపజేసిన బిలియన్ల డాలర్ల ఆస్తులను విడుదల చేయాలని ఇరాన్ పట్టుబడుతోంది.

# ఏఐతో ఉద్యోగాలు సేఫ్ అనే వారు వినండి

## 15 వేల మందిని తీసేస్తున్న కాగ్నిజెంట్

కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ తన వ్యాపార గమనాన్ని సమూలంగా మార్చే దిశగా 'ప్రాజెక్ట్ లీప్' అనే ప్రతిష్టాత్మక ప్రణాళికను అమలు చేస్తోంది. కృత్రిమ మేధ పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో, సాంప్రదాయ ఐటీ సేవల నుండి అత్యాధునిక సాంకేతిక ఆధారిత సేవల వైపు మళ్లడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. అయితే, ఈ మార్పు ప్రక్రియలో భాగంగా జశీస్త్రఅఱఓఱఅ్ కంపెనీ తన అంతర్జాతీయ శ్రామిక శక్తిలో గణనీయమైన కోత విధిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 12 వేల నుండి 15 వేల మంది ఉద్యోగులను తొలగించడానికి కాగ్నిజెంట్ సిద్ధమవుతోంది. ఈ నిర్ణయం ఐటీ పరిశ్రమలో, ముఖ్యంగా భారతదేశంలో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. కాగ్నిజెంట్ మొత్తం ఉద్యోగుల్లో సుమారు రెండున్నర లక్షల మంది భారతీయులే కావడంతో.. ఈ కోత ప్రభావం అత్యధికంగా మన దేశంపైనే పడనుంది. దాదాపు 13 వేల మంది భారతీయ ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉందని అంచనా. ఈ భారీ మార్పు వెనుక ఉన్న ప్రధాన కారణం ఐటీ పరిశ్రమలో నియామక నమూనా మారుతుండటమే. గత దశాబ్ద కాలంగా ఐటీ కంపెనీలు 'పిరమిడ్ మోడల్'ను అనుసరిస్తున్నాయి. ఇందులో భారీ సంఖ్యలో ఫ్రెషర్లు (జూనియర్లు) ఉండి, వారి పైన తక్కువ మంది సీనియర్లు పర్యవేక్షకులుగా ఉండేవారు. కానీ ప్రస్తుత డిజిటల్ యుగంలో క్లయింట్ల అవసరాలు మారాయి. వారు కేవలం పని జరిగితే సరిపోదని, అది అత్యంత సమర్థవంతంగా, వేగంగా జరగాలని కోరుకుంటున్నారు. అందుకే సీఈఓ రవి కుమార్ ఎస్ 'విశాలమైన, సంక్షిప్త పిరమిడ్' విధానాన్ని తెరపైకి తెచ్చారు. అంటే, సాధారణ పనులను ఏఐ, ఆటోమేషన్ ద్వారా పూర్తి చేస్తూ, కేవలం అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులనే కీలక బాధ్యతల్లో ఉంచడం ఈ వ్యూహం ఉద్దేశ్యం. దీనివల్ల మధ్య స్థాయి, జూనియర్ స్థాయి ఉద్యోగుల అవసరం తగ్గుతోంది. ఈ పునర్నిర్మాణ ప్రక్రియ కంపెనీపై భారీ ఆర్థిక భారాన్ని కూడా మోపుతోంది. ఉద్యోగ విరమణ ప్యాకేజీలు, ఇతర పునర్వ్యవస్థీకరణ ఖర్చుల కోసం కాగ్నిజెంట్ సుమారు విర230 నుండి విర320 మిలియన్ల వరకు కేటాయించింది. ఇందులో అధిక శాతం ఖర్చులు 2026 నాటికే పూర్తవుతాయని కంపెనీ భావిస్తోంది. అదే సమయంలో, ఏఐ రంగంలో తన పట్టును




పెంచుకోవడానికి వ్యూహాత్మక కొనుగోళ్లకు కూడా ప్రాధాన్యత ఇస్తోంది. దీనికి నిదర్శనంగా, ఏఐ-కేంద్రీకృత ఐటీ నిర్వహణ సంస్థ అయిన 'ఆస్ట్రేయా'ను సుమారు విర600 మిలియన్లకు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. అంటే ఒకవైపు ఉద్యోగుల సంఖ్యను తగ్గిస్తూనే, మరోవైపు సాంకేతిక మౌలిక సదుపాయాల కోసం భారీగా పెట్టుబడులు పెడుతోంది. కాగ్నిజెంట్ తీసుకుంటున్న ఈ చర్యలు కేవలం ఆ కంపెనీకి మాత్రమే పరిమితం కాలేదు. టీసీఎస్, యాక్సెంచర్, హెచ్‌సీఎల్‌టెక్, ఒరాకిల్ వంటి గ్లోబల్ ఐటీ దిగ్గజాలు కూడా దాదాపు ఇదే విధమైన మార్పులను అనుసరిస్తున్నాయి. మానవ శ్రమ, సాంకేతికతను మిళితం చేసే బృందాలను ఏర్పాటు చేయడం ద్వారా కంపెనీలు తమ ఉత్పాదకతను పెంచుకోవాలని చూస్తున్నాయి. సీఎఫ్ఓ జతిన్ దలాల్ అంచనాల ప్రకారం, ఈ ప్రాజెక్ట్ లీప్ ద్వారా 2026-27 నాటికి కంపెనీ వందల మిలియన్ డాలర్ల ఖర్చులను ఆదా చేయగలుగుతుంది. ఈ ఆదా అయిన మొత్తంలో కొంత భాగాన్ని తిరిగి ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి, భవిష్యత్ సాంకేతిక కొనుగోళ్లకు మళ్లించనున్నారు. క్లుప్తంగా చూస్తే, కాగ్నిజెంట్ చేపట్టిన ఈ పరివర్తన ఐటీ రంగంలో కొత్త శకానికి ఆరంభంగా కనిపిస్తోంది. ఇది తక్షణమే వేలాది మంది ఉద్యోగుల జీవితాలపై ప్రతికూల ప్రభావం చూపినప్పటికీ, దీర్ఘకాలంలో కంపెనీ యొక్క పోటీతత్వాన్ని, లాభదాయకతను పెంచుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉద్యోగులు తమ నైపుణ్యాలను నిరంతరం పెంచుకోవాల్సిన ఆవశ్యకతను ఈ పరిణామాలు మరోసారి గుర్తు చేస్తున్నాయి. ఏఐ యుగంలో మనుగడ సాగించాలంటే కేవలం శ్రమ సరిపోదని, సాంకేతిక పరిజ్ఞానమే శ్రీరామరక్ష అని స్పష్టమవుతోంది.

## ఒరాకిల్ లేఆఫ్స్ , 20 వేల మంది సీనియర్ ఉద్యోగులు ఔట్

దారుణంగా ఫ్రెషర్ల పరిస్థితి.. టెక్ రంగంలో పెను మార్పులు సంభవిస్తున్నాయి. తాజాగా సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఒరాకిల్ ప్రకటించిన తాజా లేఆఫ్స్ టెక్ రంగాన్ని నివ్వెరపరిచాయి. ప్రపంచవ్యాప్తంగా సుమారు 20 వేల నుంచి 30 వేల మంది ఉద్యోగులను తొలగించాలని సంస్థ నిర్ణయించడం, టెక్ ప్రపంచంలో నెలకొన్న అనిశ్చితికి అద్దం పడుతోంది. అమెరికా, ఇండియా, కెనడా, లాటిన్ అమెరికా దేశాల్లో ఉన్న ఒరాకిల్ కార్యాలయాలపై ఈ ప్రభావం తీవ్రంగా ఉండనుంది. సోమవారం ఉదయం ఉద్యోగులకు అందిన ఈ-మెయిల్స్ వారి భవిష్యత్తును ఒక్కసారిగా ప్రశ్నార్థకం చేశాయి. ఈ లేఆఫ్స్‌లో అత్యంత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. కంపెనీ కేవలం ఖర్చు తగ్గించుకోవడమే కాకుండా, అత్యంత అనుభవం ఉన్న సీనియర్ ఉద్యోగులను సైతం లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోంది. దీనికి నిదర్శనంగా, ఒరాకిల్‌లో 33 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న నీనా లివిస్ వంటి సీనియర్ సెక్యూరిటీ ప్రొఫెషనల్ కూడా తన ఉద్యోగాన్ని కోల్పోయారు. 1990లో సంస్థలో చేరి, డేటాబేస్, ఎథికల్ హ్యాకింగ్, సెక్యూరిటీ ప్లాట్‌ఫామ్‌ల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన నిపుణులను కూడా వదులుకోవడం, కంపెనీ ప్రాధాన్యతలు ఏ విధంగా మారుతున్నాయో తెలియజేస్తోంది. కృత్రిమ మేధ ప్రభావం వల్ల సీనియర్ల స్థానాలు ప్రమాదంలో పడ్డాయని నీనా లివిస్ వ్యక్తం చేసిన అభిప్రాయం ఇప్పుడు సాఫ్ట్‌వేర్ నిపుణుల్లో చర్చనీయాంశమైంది. రాతీుఎశ్రీవ మాత్రమే కాకుండా మెటా, మైక్రోసాఫ్ట్, డిస్నీ వంటి ఇతర దిగ్గజ సంస్థలు కూడా గత కొంతకాలంగా భారీగా ఉద్యోగాలను తొలగిస్తున్నాయి. ఈ కంపెనీలన్నీ ఇప్పుడు "ఏఐ ఫస్ట్" అనే వ్యూహంతో ముందుకు వెళ్తున్నాయి. అంటే, పనులను ఆటోమేట్ చేయడం ద్వారా మానవ వనరుల అవసరాన్ని తగ్గించుకోవడమే వీటి ప్రధాన లక్ష్యం. తక్కువ పెట్టుబడితో, తక్కువ మంది ఉద్యోగులతో అధిక లాభాలను ఆర్జించాలనే కార్పొరేట్ ధోరణి పెరిగింది. ఈ క్రమంలోనే భారీ వేతనాలు తీసుకునే సీనియర్ల కంటే, ఏఐ సాంకేతికతను వాడుకుంటూ తక్కువ జీతానికి పనిచేసే యువ ఉద్యోగుల వైపు కంపెనీలు మొగ్గు చూపుతున్నాయి. ఈ మార్పుల వల్ల కొత్తగా పట్టభద్రులైన ఫ్రెషర్ల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఒకప్పుడు ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు విరివిగా లభించేవి, కానీ ఇప్పుడు ఆ పనులన్నీ ఆటోమేషన్ పరిధిలోకి వెళ్లిపోయాయి. టాప్ కంపెనీలు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ తగ్గించడమే కాకుండా, అత్యవసరమైతే తప్ప కొత్తవారిని తీసుకోవడం లేదు. దీంతో నిన్నటి వరకు సురక్షితమని భావించిన మేనేజర్, డైరెక్టర్ స్థాయి ఉద్యోగాలు కూడా ఇప్పుడు గ్యారెంటీ లేకుండా పోయాయి. విద్యా సంస్థలు సైతం ఇప్పుడు 100 శాతం ఉద్యోగ హామీ ఇవ్వలేకపోతున్నాయి. ఒరాకిల్ తన వ్యాపారాన్ని క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వైపు మళ్లించుకుంటోంది. ఈ ప్రక్రియలో భాగంగా తన వర్క్‌ఫోర్స్‌ను పూర్తిగా పునర్నిర్మించుకుంటోంది. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ, పాత తరం నైపుణ్యాల కంటే ఆధునిక ఏఐ నైపుణ్యాలకు విలువ పెరుగుతోంది. అయితే, దశాబ్దాల కాలం కంపెనీ ఎదుగుదల కోసం శ్రమించిన నిపుణులను ఇలా హఠాత్తుగా తొలగించడం శోచనీయం. లాభాలే పరమావధిగా సాగుతున్న ఈ ప్రయాణంలో ఉద్యోగ భద్రత అనేది నేడు ఒక మిథ్యగా మారుతోంది. టెక్ నిపుణులు తమను తాము నిరంతరం అప్‌డేట్ చేసుకుంటే తప్ప, ఈ పోటీ ప్రపంచంలో మనుగడ సాగించడం కష్టతరంగా మారుతోంది.ం

## టీసీఎస్ కీలక నిర్ణయం ఐటీ ఉద్యోగాల్లో ఏఐ ఏజెంట్ల హవా, ఫ్రెషర్ల నియామకాలపై భారీ ప్రభావం!




ఐటీ రంగంలో పెను మార్పులు రాబోతున్నాయని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ స్పష్టం చేశారు. త్వరలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏజెంట్లు వివిధ విభాగాల్లో మనుషులతో సమానంగా పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల దేశంలోనే అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సంస్థ అయిన టీసీఎస్ నియామక ప్రక్రియలో శాశ్వత మార్పులు రానున్నాయి. ఇకపై కేవలం ఉద్యోగుల సంఖ్య కంటే, ఆటోమేషన్ టూల్స్ ద్వారా పని సామర్థ్యాన్ని పెంచుకోవడంపైనే కంపెనీ ప్రధానంగా దృష్టి పెట్టనుంది.ప్రస్తుతం టెక్ పరిశ్రమలో పాత రిక్రూట్‌మెంట్ పద్ధతులు సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఇన్ఫోసిస్, విప్రో వంటి దిగ్గజ కంపెనీలు కూడా ప్రాజెక్టుల వేగం పెరిగినప్పటికీ, క్యాంపస్ నియామకాలను తగ్గించాయి. ఏఐ టూల్స్ వల్ల ఉత్పాదకత పెరగడంతో, తక్కువ మంది సిబ్బందితోనే ఎక్కువ పనిని పూర్తి చేసే అవకాశం కలిగింది. ఈ పరిణామం భారతీయ ఐటీ రంగంలో ఎంట్రీ లెవల్ ఉద్యోగాల కోతకు దారితీసేలా కనిపిస్తోంది. ఏజెంట్ల ప్రభావం: ఫ్రెషర్ల నియామకాలు, ఐటీ ఉద్యోగాల భవితవ్యంఐటీ రంగంలో ఇప్పుడు జనరల్ సాఫ్ట్‌వేర్ రోల్స్ కంటే స్పెషలైజ్డ్ టాలెంట్‌కే డిమాండ్ పెరుగుతోంది. భవిష్యత్తులో మెషిన్ లెర్నింగ్ ఆపరేషన్స్ , డేటా ఇంజనీరింగ్ వంటి విభాగాల్లో నైపుణ్యం ఉన్నవారికే ప్రాధాన్యత ఉంటుంది. అనుభవం ఉన్నవారిని తీసుకునేటప్పుడు కూడా 'ఏజెంటిక్ వర్క్‌ఫ్లోస్' నిర్వహించగల వారికే కంపెనీలు మొగ్గు చూపుతున్నాయి. గ్లోబల్ మార్కెట్‌లో ప్రాజెక్టుల డెలివరీ, క్లయింట్ సంతృప్తి కోసం ఈ ఏఐ ప్రక్రియలు ఇప్పుడు కీలకంగా మారాయి. అందుకే, కొత్తగా వచ్చే టెక్నాలజీలపై పట్టు ఉన్న అభ్యర్థులకే రిక్రూటర్లు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు.నైపుణ్యం నియామకాల ట్రెండ్‌మరియు భారీ డిమాండ్‌డేటా ఇంజనీరింగ్‌అత్యంత ప్రాధాన్యతబేసిక్ డెవలప్‌మెంట్ తగ్గిన నియామకాలుస్కిల్స్ మార్పు.. కార్పొరేట్ రంగంలో ఏఐ ఏజెంట్ల హవా2027 ఆర్థిక సంవత్సరం నాటికి జీతాల నిర్మాణంలో, ముఖ్యంగా వేరియబుల్ పేలో భారీ మార్పులు ఉండవచ్చు. ఉద్యోగి ఉత్పాదకత, ఏఐ టూల్స్‌ను ఎంతవరకు వాడుతున్నారనే అంశాల ఆధారంగానే ఈ చెల్లింపులు ఉండే అవకాశం ఉంది. ఆటోమేషన్ వేగంగా పెరుగుతున్న తరుణంలో ఉద్యోగులు తమ నైపుణ్యాలను పెంచుకోవడం ) తప్పనిసరని నిపుణులు సూచిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో ఏఐని భాగం చేసే సిబ్బందికి కంపెనీలు మంచి ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. లాభాలను పెంచుకుంటూనే, అంతర్జాతీయ క్లయింట్‌లకు వేగంగా సేవలు అందించడమే లక్ష్యంగా కంపెనీలు ఈ వ్యూహాన్ని అనుసరిస్తున్నాయి.బేసిక్ కోడింగ్ పనుల కోసం భారీగా ఉద్యోగులను తీసుకునే రోజులు త్వరలోనే ముగియనున్నాయి. ఈ పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే భారతీయ ఐటీ నిపుణులు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ ఉండాలి. ఏఐ ఏజెంట్ల వైపు మళ్లుతున్న ఈ మార్పును అందిపుచ్చుకోవాలంటే నైపుణ్యాల అభివృద్ధిలో చురుగ్గా ఉండటం ఒక్కటే మార్గం. ఆటోమేషన్‌ను అధిగమించి కెరీర్‌లో ఎదగాలంటే ఈ మార్పులకు అనుగుణంగా మారడం అత్యవసరం. ఇదే భారతీయ సాఫ్ట్‌వేర్ రంగ భవిష్యత్తును నిర్ణయించనుంది.



## వెంకీ-కళ్యాణ్ రామ్ మల్టీస్టారర్ మలయాళ రీమేక్ కాదు.. రూమర్లకు చెక్ పెట్టిన కీర్తి సురేష్!

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కాంబినేషన్‌లో సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న తాజా మల్టీస్టారర్ చిత్రంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతన్న సంగతి తెలిసిందే. పృథ్వీరాజ్ సుకుమారన్, బేసిల్ జోసెఫ్ నటించిన మలయాళ సూపర్ హిట్ కామెడీ చిత్రం 'గురువాయూర్ అంబలనాడైల్'కు ఇది రీమేక్ అంటూ వార్తలు వస్తున్నాయి. అయితే ఈ రూమర్స్‌పై స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ స్పందించి గట్టి క్లారిటీ ఇచ్చారు. ఈ రూమర్లన్నీ ముమ్మాటికీ వాస్తవ దూరం అని తేల్చి చెబుతూ, ఇది ఏ సినిమాకూ రీమేక్ కాదని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. దర్శకుడు అనిల్ రావిపూడి తన సొంత శైలిలో రాసుకున్న పక్కా ఒరిజినల్ స్క్రిప్ట్‌తో, హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్ మరియు ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తూ, సురేష్ ప్రొడక్షన్స్ సమర్పిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో వెంకటేష్ సరసన కీర్తి సురేష్ నటిస్తుండగా, కళ్యాణ్ రామ్ జోడీగా కృతి శెట్టి నటిస్తోంది. జాతీయ అవార్డు గ్రహీత జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. 2027 సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా రీమేక్ కాదని, స్ట్రెయిట్ ఒరిజినల్ కథేనని కన్ఫర్మ్ కావడంతో అటు విక్టరీ వెంకటేష్, ఇటు నందమూరి కళ్యాణ్ రామ్ అభిమానులు ఫుల్ హ్యాపీగా ఉన్నారు.



## 'నాగబంధం'లో అసలైన సర్‌ప్రైజ్ విలన్.. అబ్దాలీగా రిషబ్ సాహ్నీ నటనకు ప్రేక్షకుల ఫిదా!


యంగ్ హీరో విరాట్ కర్ణ ప్రధాన పాత్రలో, దర్శకుడు అభిషేక్ నామా తెరకెక్కించిన డివైన్ మైథలాజికల్ థ్రిల్లర్ 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' జూలై 3న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సనాతన ధర్మం, పురాతన ఆలయాల రహస్యాలు, భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంటోంది. ముఖ్యంగా సినిమాలోని విజువల్స్‌తో పాటు విలన్ పాత్రలో నటించిన రిషబ్ సాహ్నీ నటన ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సినిమాలో 'అబ్దాలీ' పాత్రలో కనిపించిన రిషబ్ సాహ్నీ తన పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తున్నాడు. ప్రతి సన్నివేశంలోనూ తన కళ్లలో కనిపించే తీవ్రత, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీతో ఒక భయానక ప్రతినాయకుడిగా ఆకట్టుకున్నాడు. తెరపై ఆయన కనిపించిన ప్రతిసారీ కథలో ఉత్కంఠ మరింత పెరిగిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. సోషల్ మీడియాలో కూడా రిషబ్ నటనపై ప్రశంసల వర్షం కురుస్తోంది. అబ్దాలీ ఎంట్రీతో థియేటర్‌లో వాతావరణమే మారిపోయింది , హీరోతో సమానంగా విలన్ పాత్రకు బలం తీసుకొచ్చాడు , రిషబ్ సాహ్నీ కెరీర్‌లో ఇదే బెస్ట్ పెర్ఫార్మెన్స్ అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. 'నాగబంధం' కథ శ్రీరంగపురంలోని ఓ పురాతన ఆలయాన్ని కేంద్రంగా సాగుతుంది. అక్కడ దాగి ఉన్న బ్రహ్మకమలం, మహాశక్తివంతమైన 'నాగబంధం' గ్రంథాన్ని సొంతం చేసుకుని అమరత్వం పొందాలని ప్రయత్నించే దుష్టశక్తుల కుట్ర చుట్టూ కథ తిరుగుతుంది. ఈ ప్రమాదాన్ని అడ్డుకునేందుకు రంగంలోకి దిగిన యువకుడు 'రుద్ర' చేసే సాహసయాత్ర ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని అందిస్తుంది. పురాణ గాథలు, ఆలయ రహస్యాలు, మిస్టరీ, యాక్షన్ అంశాలను సమన్వయం చేస్తూ దర్శకుడు అభిషేక్ నామా సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించారు. విజువల్ ఎఫెక్ట్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయి.

## 'ది ప్యారడైజ్' కోసం నాని భారీ త్యాగం.. రెండు క్రేజీ సినిమాలకు నో చెప్పిన నేచురల్ స్టార్!



నేచురల్ స్టార్ నాని హీరోగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నాని 'జడల్' అనే పూర్తి స్థాయి మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయనకు జోడీగా కయాదు లోహర్ 'సుబ్బలక్ష్మి' పాత్రలో నటిస్తోంది. విలక్షణ నటుడు మోహన్ బాబు ప్రధాన ప్రతినాయకుడిగా కనిపించనుండగా, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, జీకే విష్ణు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మొదట ఈ సినిమాను ఆగస్టు 21న విడుదల చేయాలని భావించినప్పటికీ, నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో విడుదల తేదీ సెప్టెంబర్ 25కు మారే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు పలు అంతర్జాతీయ భాషల్లో కూడా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. 'ది ప్యారడైజ్'పై పూర్తి దృష్టి పెట్టిన నాని, ఇతర సినిమాలను తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. షూటింగ్ ఆలస్యం కావడం వల్ల ఆయన రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను వదులుకోవాల్సి వచ్చినట్లు సమాచారం. మొదటిది, 'హాయ్ నాన్న' దర్శకుడు శౌర్యువ్ సిద్ధం చేసిన కొత్త సినిమా. కథ నచ్చినా డేట్స్ అందుబాటులో లేకపోవడంతో, ఆ ప్రాజెక్ట్‌ను వేరే హీరోతో ముందుకు తీసుకెళ్లాలని నాని సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ కథ విజయ్ దేవరకొండ వద్దకు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక రెండోది, 'జై భీమ్' దర్శకుడు టీజే జ్ఞానవేల్ రూపొందించాలనుకున్న చిత్రం. కథపై నానికి మంచి అభిప్రాయం ఉన్నప్పటికీ, డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఈ కాంబినేషన్ కార్యరూపం దాల్చలేదని తెలుస్తోంది. ప్రస్తుతం జ్ఞానవేల్ హీరో సూర్యతో తన తదుపరి చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'ది ప్యారడైజ్' పూర్తైన తర్వాత దర్శకుడు సుజీత్‌తో కలిసి 'బ్లడీ రోమియో' అనే సినిమా చేయాలని నాని భావిస్తున్నట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. అయితే సుజీత్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్‌తో 'ఓజీ-2' ప్రాజెక్ట్‌పైనా దృష్టి పెట్టడంతో, నాని-సుజీత్ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

## పెద్ది ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్.. రామ్ చరణ్ బ్లాక్‌బస్టర్ డిజిటల్ స్ట్రీమింగ్ ఎప్పటి నుండి అంటే..!




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. గ్రామీణ క్రీడల నేపథ్యంతో రూపొందిన ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించింది. థియేటర్లలో సూపర్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. 'పెద్ది' ఓటీటీ విడుదల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అభిమానులకు మేకర్స్ శుభవార్త చెప్పారు. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటించింది. జూలై 9 నుంచి ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి రానుంది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో కూడా ఒకేసారి స్ట్రీమింగ్ చేయనున్నట్లు నెట్‌ఫ్లిక్స్ వెల్లడించింది. దీంతో థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇంట్లోనే ఈ చిత్రాన్ని ఆస్వాదించే అవకాశం దక్కనుంది. విడుదలైన తొలి రోజు నుంచే 'పెద్ది'కి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామీణ నేపథ్యంలో స్పోర్ట్స్, ఎమోషన్, ఫ్యామిలీ డ్రామా అంశాలను సమతుల్యంగా మిళితం చేసిన బుచ్చిబాబు కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా రామ్ చరణ్ నటన, పాత్రలోని తీవ్రత, భావోద్వేగ సన్నివేశాలు సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి ఈ చిత్రం రామ్ చరణ్ కెరీర్‌లో మరో భారీ విజయంగా నిలిచింది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా నటించి తన నటనతో ప్రశంసలు అందుకుంది. అలాగే దివ్యేందు, బొమన్ ఇరానీ, జగపతిబాబు, రవికిషన్ తదితరులు కీలక పాత్రల్లో మెప్పించారు. ప్రతి పాత్ర కథకు బలం చేకూర్చేలా దర్శకుడు తీర్చిదిద్దిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు, ఇషాన్ సక్సేనా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. అత్యున్నత నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్స్, సంగీతం, ఎమోషనల్ కథనం కలిసి 'పెద్ది'ని ఈ ఏడాది అతిపెద్ద విజయాల్లో ఒకటిగా నిలబెట్టాయి.థియేటర్లలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీలో కూడా అదే స్థాయి ఆదరణ దక్కించుకుంటుందా అన్నది ఆసక్తికరంగా మారింది.



## ప్రెగ్నెన్సీలోనూ ఫుల్ బిజీగా సమంత.. కొత్త టాక్ షోతో ఓటీటీలో సందడి చేయనున్న స్టార్ హీరోయిన్?

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత జీవితంలో 2026 సంవత్సరం ఎంతో ప్రత్యేకంగా మారింది. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా వరుస సంతోషాలను ఆస్వాదిస్తున్న ఆమె ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదించేందుకు సిద్ధమవుతోంది. గతేడాది డిసెంబర్‌లో దర్శకుడు రాజ్ నిడిమోరును వివాహం చేసుకున్న సమంత, ఈ ఏడాది విడుదలైన 'మా ఇంటి బంగారం' చిత్రంతో భారీ విజయాన్ని అందుకుంది. అదే సమయంలో ఆమె గర్భవతి అనే శుభవార్త కూడా అభిమానులతో పంచుకుంది. ప్రెగ్నెన్సీ కారణంగా సమంత కొంతకాలం పూర్తిగా విశ్రాంతి తీసుకుంటారని అభిమానులు భావించినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం ఆమె మరో కొత్త ప్రాజెక్ట్‌తో ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. సమంత మరోసారి హోస్ట్‌గా మారనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. గతంలో ప్రముఖ ఓటీటీ వేదిక కోసం చేసిన 'సామ్ జామ్' టాక్ షో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. సినీ ప్రముఖులతో సమంత జరిపిన ఆసక్తికర సంభాషణలు ఆ షోకు మంచి ఆదరణ తీసుకొచ్చాయి. ఇప్పుడు ప్రముఖ ఓటీటీ సంస్థ సోనీలివ్ తమిళ్ కోసం సమంత ఓ ప్రత్యేక టాక్ షో చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా సోనీలివ్ తమిళ్ తమ సోషల్ మీడియా ఖాతాలో "సమంతతో కలిసి ఓ స్పెషల్ ప్రాజెక్ట్‌పై పని చేస్తున్నాం. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం" అంటూ చేసిన పోస్ట్‌ను సమంత కూడా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేయడంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరింది.వీశీజఱవం ఈ టాక్ షో ప్రధానంగా తమిళ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందనున్నట్లు సమాచారం. ఇందులో సమంత తమిళంతో పాటు ఇంగ్లీష్‌లో కూడా సెలబ్రిటీలతో సరదాగా ముచ్చటించనున్నట్లు తెలుస్తోంది. ఆమె హోస్టింగ్ స్టైల్‌కు ఇప్పటికే మంచి గుర్తింపు ఉండటంతో, ఈ కొత్త షోపై కూడా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం సమంత గర్భవతిగా ఉండటంతో భారీ యాక్షన్ సన్నివేశాలు, డ్యాన్స్‌లు లేదా దీర్ఘకాలిక షూటింగ్‌లకు దూరంగా ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎక్కువ శారీరక శ్రమ అవసరం లేని టాక్ షో చేయడం ఆమెకు అనుకూలంగా ఉంటుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. టాక్ షో ఫార్మాట్‌లో ఎక్కువగా కూర్చుని సంభాషణలు సాగుతాయి కాబట్టి, ప్రెగ్నెన్సీ సమయంలో కూడా ఈ తరహా ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. అయితే ఈ టాక్ షో ఎప్పుడు ప్రారంభమవుతుందనే విషయంపై మాత్రం ఇంకా అధికారిక సమాచారం వెలువడలేదు.

EDITOR, PRINTER AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri -515411,Anantapur District Andra Pradesh,Published at #1/111, SC PETA,RAMPAYARRAM PALEM,GOKARAM (V&P),GOKARAM (M), GOKARAM.EAST GODAVARI-533286Andra Pradesh EDITOR B.JAVEED BASHA PRGI. NO : APTEL/26/A4786, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com